Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జ్యోతి

సంపుటి: 82 • సంచిక: 42 • 21-10-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

జ్యోతి
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు


a *** hotel with 5 star comforts
D.R. UTTHAMA HOTEL
Winner of Excellence Award 2004, 2005 & 2006
G.T.Road, Nellore - 524 003.(A.P)
Ph: 0861 - 2317777
email - drutthama@yahoo.co.in

నీళ్లు చిలకరించిన పాలపొంగులా

చల్లారిన తెలంగాణ ఉద్యమం!

ఎక్కడో ఏదో జరిగింది. ఏమి జరిగిందో, ఎట్లా జరిగిందో, ఎవరి ద్వారా జరిగిందో చిదంబర రహస్యం. కానీ వూహకు అందని, చూపులకు కనపడని స్థాయిలో ఏదో మతలబు జరిగిపోయింది. మహోధృతంగా కొనసాగుతున్న తెలంగాణ ఉద్యమం నీళ్లు చిలకరించిన పాలపొంగు వలె చల్లారి పోతున్నది. క్షణాలలో మార్పు. ఆవేశాలు అణిగిపోయాయి. భీకర ప్రతిజ్ఞలు తేలి పోయాయి. శపథాలు వీగి పోయాయి. సకల జనుల సమ్మెకు సహజ మరణం సిద్ధిస్తున్నది. ఆర్టీసి బస్సులు రోడ్డు మీదకు వచ్చాయి. సింగరేణి బొగ్గు గనులలో పని వేళైందని కార్మికులను పిలిచే సైరన్ కూతలు వినపడుతున్నాయి. రైళ్లు సాఫీగా నడుస్తున్నాయి. అయ్యవార్లు బడులకు వెళ్లి పిల్లలకు పాఠాలు చెప్తున్నారు. గ్రామాలలో సాధారణ జీవనం నెలకొంటున్నది. ఒక్క ప్రభుత్వ ఉద్యోగులు తప్ప, తెలంగాణను స్తంభింప చేసిన సకల జనులందరూ నిశ్శబ్దంగా సమ్మె విరమణ చేస్తున్నారు.

దేనివల్ల ఈ మార్పు? తెలంగాణ ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పలేదు. ఖచ్చితంగా వస్తుందన్న సంకేతాలూ విడుదల కాలేదు. సమ్మె విరమించమని కెసిఆర్ పిలుపు ఇవ్వలేదు. జెఎసి కన్వీనర్ కోదండరాం విరమణ ప్రకటన చేయలేదు. కానీ సమ్మె నీరు గారి పోయింది. పట్టు సడలింది. తెర వెనుక ఏదో జరగకుంటే ఒక్క వారంలో ఇంత మార్పు సాధ్యం కాదు. పిసిసి అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణ మొదటగా ఆర్టీసి కార్మిక నేతలను బుజ్జగించాడు. అది బుజ్జగింపు కాదు, జేబు నింపే పథకం అంటున్నారు కార్మికులు. ఏదైతేనేమి, బస్సులు బయటకు వచ్చాయి. సింగరేణి బొగ్గు గని కార్మికులు వారిని అనుసరించారు. బడి పంతుళ్లు వెంట నడిచారు. మరొకప్రక్క ఆర్భాటంగా రైలు రోకో ప్రకటించిన కోదండరాం, కెసిఆర్‌ల జంట, తమవారు పదిమందిని అరెస్టు చేసి జైలుకు పంపగానే జావగారి పోయారు. రెండవ రోజుకల్లా రైలు రోకో విఫలమైపోయింది.


విచిత్రమైన పరిణామం ఇది. సకల జనుల సమ్మెతో తెలంగాణ ఉద్యమం ఎంత తారాస్థాయికి చేరిందో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగా గడగడ లాడిపోయాయో అందరికీ తెలుసు. ఆ దశలో నేతలను అరెస్టు చేసి జైలుకు పంపితే ఉద్యమం మరింత జఠిలం కావాలే తప్ప జావగారి పోకూడదు. కానీ అందుకు విరుద్ధంగా జరిగింది.

ఇందుకు రెండు కారణాలు కన్పిస్తున్నాయి. మొదటిది – ఉద్యమంలో హింస చోటు చేసుకొనే ప్రమాదం కన్పించడంతో కెసిఆర్ వ్యూహాత్మకంగా వెనుకడుగు వేశాడన్నది. మొదట నుంచి తెలంగాణ ఉద్యమాన్ని హింసకు దూరంగా పెట్టడానికి ప్రాధాన్యత ఇస్తున్నాడు కెసిఆర్. ఒకసారి హింస చెలరేగితే, ఆ తర్వాత అది ఎవరి అదుపులో వుండదని, ప్రభుత్వం సులభంగా అణిచి వేస్తుందని ఆయన అభిప్రాయం. అరెస్టులకు నిరసనగా వీధి పోరాటాలు ప్రారంభిస్తే పలు వర్గాలకు చెందిన వారు అందులో చేరిపోయి ఉద్యమాన్ని పక్కదారి పట్టిస్తారన్న భయంతో వెనుకడుగు వేసి వుండవచ్చు. రెండవ కారణం – సమ్మె చేస్తున్న వివిధ వర్గాల నేతలను ముఖ్యమంత్రి దానోపాయంతో లొంగదీసుకోవడం కావచ్చు. ఆర్టీసి కార్మిక నేతల విషయంలో ఈ అనుమానాలు బలంగా వున్నాయి. పెద్ద మొత్తంలో డబ్బు జేబులలోకి చేరిన తర్వాతనే ఆ నేతలు సమ్మె విరమణ పిలుపు ఇచ్చారని ఆర్టీసి కార్మికులందరూ నమ్ముతున్నారు. అందువల్లనే ఆ సంఘటన తర్వాత ఆ కార్మిక సంఘం నిట్టనిలువుగా చీలిపోయింది. ఆ ఇద్దరు నేతలూ ముఖం చెల్లక, రాష్ట్రంలోనే లేకుండా బెంగుళూరులో మకాం పెట్టారు.

మరొక కారణం – ఢిల్లీ స్థాయిలో కాంగ్రెస్

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్కేప్



ఆత్మహత్య చేసుకోబోయే కుటుంబాలకు ఏం లేదా మావా!



[దేశం ఎటు పోతుంది?]

ప్రధాని మన్మోహన్‌సింగ్ సచ్ఛీలుడు. మచ్చలేని వ్యక్తిత్వం కల్గినవాడు. గిట్టనివారు కూడా ఆయన వైపు వేలెత్తి చూపలేరు. ప్రజాజీవితంలో నిజాయితీ, నిష్పక్ష పాతం, నిష్కల్మషత్వం, నిరాడంబరత్వం, ప్రభుత్వ నిర్వహణలో అంకిత భావం, జనహితం పట్ల చిత్తశుద్ధి వంటి సులక్షణాలు పుష్కలంగా కల్గినవాడు. సమకాలీన రాజకీయాలలో ఆయన వంటి విశుద్ధ వర్తనులు చాలా అరుదుగా కన్పడతారు. అవి నీతితో, ఆశ్రిత పక్షపాతంతో, బంధుప్రీతితో, అధికారకాంక్షతో, ధన దాహంతో, దురాశతో మరణశయ్య మీద కూడా పద వుల ప్రాకులాటతో పుచ్చిపోయి, కుళ్లు కంపు కొట్టే రాజకీయ వ్యవస్థ మనది. అటువంటి గంజాయి వనంలో మన్మోహన్ సింగ్ వంటి తులసి మొక్క బ్రతికి బట్ట కట్టగలగడం అబ్బుర పడవలసిన విషయం.

కానీ విచిత్రంగా, ఇదే మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం దోపిడీ సర్కారుగా ముద్రపడి పోతున్నది. భారత దేశ చరి త్రలో ఇంతగా భ్రష్ట పట్టిన ప్రభుత్వం మరొకటి లేదన్న రికార్డు సృష్టిస్తున్నది. ప్రజా ధనాన్ని పటికబెల్లం వలె నంజుకొని తినే అక్రమార్కులకు నెలవుగా నడుస్తున్నది. ప్రభుత్వ ఖజానాకు కన్నం పెట్టే పంది కొక్కుల కూటమిగా మారుతున్నది. ప్రజలలో రాజకీయ వ్యవస్థ మీదనే విశ్వాసం సడలి పోయే స్థాయికి పతనమై పోతున్నది. దిగజారుడుకు పర్యాయ పదంగా చరిత్రలో నిలిచిపోతున్నది.

ఒకటా, రెండా... ఎన్ని కుంభకోణాలు, ఎన్నెన్ని స్కాములు? సిబిఐకి, సుప్రీంకోర్టుకు వేరే పని చేసుకొనే అవ కాశం దొరకడం లేదు. ప్రజల సొత్తు బొక్కిన పందికొక్కులను చట్టం చెరకు పట్టించడానికి ఆ రెండు ప్రజాస్వామిక సంస్థలూ అహోరాత్రులు పని చేయవలసి వస్తున్నది. 2జి స్కాం, ఆదర్శ్ గృహ గోల్మాల్‌లు, కామన్‌వెల్త్ స్కాములు, కృష్ణా బేసిన్ గ్యాస్ పెట్టుబడుల దగా, ఎయిర్‌సెల్ కంపెనీపై దయానిధి మారన్ దౌర్జన్యం వంటి దుర్మార్గాలు మన్మోహన్‌సింగ్ సర్కారు ఘనత లుగా కన్పిస్తున్నాయి. ప్రజల ఆస్తికి ధర్మకర్తల వలె వుండ వలసిన ప్రభుత్వ నిర్వాహకులు, ఇంత విచ్చలవిడిగా, విశృంఖలంగా ప్రజా ధనాన్ని దోచుకోవడం ఒక పక్క మన సుకు బాధ కల్గిస్తుంటే, ఈ అకృత్యాలన్నీ మన్మోహన్‌సింగ్‌కు తెలిసే జరిగాయన్న నిజం ప్రజలను మరింత క్షోభ పెడు తున్నది. స్పెక్ట్రం అమ్మకంలో అప్పటి కమ్యూనికేషన్ల మంత్రి ఎ.రాజా తప్పు చేస్తున్నాడని ప్రభుత్వానికి తెలుసు. అది తప్పని, వేలం ద్వారా మాత్రమే అమ్మకం జరగాలని ఆయన లేఖ కూడా వ్రాశాడు. ఆనాటి ఆర్థికమంత్రి చిదంబరం ఒక పక్క ఆర్థికశాఖ అధికారులు మరొకపక్క అభ్యంతరాలు చెప్పారు. అయినా రాజా వినలేదు. తనకు డబ్బు మూటలు అందించిన వారి ప్రయోజనం కోసం అందరి మాటా పెడ చెవిన పెట్టి, స్పెక్ట్రం పందారం చేశాడు. దానివల్ల దేశానికి జరిగిన నష్టం లక్షా డెబ్భై వేల కోట్ల రూపాయలు. పెట్రోల్ అన్వేషణలో రిల యన్స్ అంబానీలు దగా చేస్తున్నారని ప్రధానికి తెలుసు. ఆర్థిక శాఖకూ తెలుసు. కానీ ఆనాటి పెట్రోలియం మంత్రి మురళీ దేవరా అంబానీలకు వంత పాడాడు. ఆయన మాటే నెగ్గింది. దానివల్ల దేశానికి కల్గిన నష్టం రెండున్నర లక్షల కోట్ల రూపా యలు. కామన్‌వెల్త్ ఆటల పోటీలను సురేష్ కల్మాడీ ప్రధానిని ధిక్కరించి అందినంత దోచుకొన్నాడు. ఓటుకు నోటు కుంభకో ణంలో అమర్ సింగ్ చేసిన పాపం వల్ల ప్రయోజనం పొందిన వాడు సాక్షాత్తు ప్రధానే కావడం గమనార్హం. ఆ ఓట్లు లేకుంటే ఆయన ప్రభుత్వం అవిశ్వాస తీర్మానంతో కుప్పకూలి వుండేది. ఇవి బయటపడిన నేరాలు. ప్రభుత్వ దస్త్రాల కుప్పలో, ప్రపం చం కళ్ల పడకుండా ఇంకెన్ని కుంభకోణాలు దాగి వున్నాయో తెలియదు.

జమీన్‌రైతు

ఒక వ్యక్తిగా మన్మోహన్‌సింగ్ ఉత్త ముడు కావచ్చు. కానీ ఒక ప్రభుత్వ నేతగా ఆయన ప్రవర్తించిన, ప్రవర్తిస్తున్న తీరు మాత్రం అవినీతిపరు లైన రాజకీయవాదుల కంటే అధమ స్థాయిలో వుంది. ఆయన బలహీనత, అక్రమార్కుల బలంగా పరిణమిస్తున్నది. వారిని నివారించలేని, నిరోధించలేని నిస్సహాయ స్థితిలో మన్మో హన్ సింగ్ కొట్టుమిట్టాడం దేశానికి అరిష్టంగా మారింది. కనీసం, ఈ కుంభకోణాలు బయటపడిన తర్వాత అయినా ఆయన తన నిజాయితీకి తగినట్లు స్పందించి వుంటే దేశ ప్రజానీకానికి కొంతలో కొంత వూరట లభించి వుండేది. కానీ ఆయన తనకు పదవీ కాంక్ష లేదని నమ్మిస్తూనే, సంకీర్ణ ధర్మం అనే కుంటిసాకు చూపి, తన సర్కారును దోపిడీకి పర్యాయ పదంగా మార్చి వేశాడు.

ఇటువంటి నేతలు, ఇటువంటి ప్రభుత్వాలు ఇట్లనే మను గడ సాగిస్తే దేశం ఏమైపోతుందో అన్న ఆందోళన కల్గుతు న్నది. ఇప్పుడు దేశానికి కావలసింది – ఉత్తములైన నేతలు కాదు. ఉత్తమ పరిపాలన అందించే ప్రభుత్వం. సుప్రీంకోర్టు వ్యాఖ్యల తర్వాత అయినా మన్మోహన్‌సింగ్‌లో పరిణితి కలిగి, తన వ్యక్తిత్వానికి తగినట్లు నడుచుకొంటాడని ఆశిద్దాం.

జనవాక్కు

జగన్‌ను సిఎం చేసి వుంటే...

డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం మెజార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రజలు కోరుకొన్నట్లు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసి వుంటే రాష్ట్రానికి ఇప్పుడున్న దుస్థితి తప్పేది. వేర్పాటు వాద ఉద్యమం రాజశేఖర్‌రెడ్డి హయాంలో మాదిరి అణిగి మణిగి ఉండేది. రాష్ట్రంలో పరిపాలన స్తంభించి పోవడం, సకల జనుల సమ్మె, విద్యుత్ సంక్షోభం, పన్నుల పెంపకం, ఎమ్పీలు, మంత్రుల ధిక్కార స్వరానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

బి.ఆర్.శాలి కావలి

షుగర్ ఫాక్టరీ ఇబ్బందుల్లో లేదు!

కోవూరు షుగర్ ఫాక్టరీ నిర్వహణపై 'జమీన్‌రైతు'లో ఇటీవల ఒక వార్త ప్రచురించారు. వాస్తవానికి కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ఎప్పుడూ రైతాంగానికి కామధేనువు వంటిది. కానీ దాన్ని పరిపాలించేందుకు వచ్చే అధికారులు మంచి వాళ్లు కాదు. ఫ్యాక్టరీలో వున్న వరకు ఊడ్చుకొని వేరే ఫ్యాక్టరీలకు తరలి వెళ్లిపో యారు. ఇప్పుడు షుగర్ ఫ్యాక్టరీకి మేనేజింగ్ డైరక్టర్‌గా వచ్చిన సుధాకర్‌రెడ్డి చాలా మంచివాడు. గతంలో 20 సంవత్సరాలు ఫ్యాక్టరీలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసిన వ్యక్తి. ఫ్యాక్టరీ గల్లాపెట్టె ఖాళీగా వున్నా సుధాకర్‌రెడ్డి ధైర్యం కోల్పో కుండా అధికారులు, ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రిని కలసి ఫ్యాక్టరీ పరిస్థితిని వివ రించారు. చిత్తూరు, రేణిగుంట షుగర్ ఫ్యాక్టరీలకు ప్రభుత్వ ఆర్థిక సాయం అం దింది. ఆర్థికమంత్రి మన జిల్లావాసి అయి కూడా కోవూరు షుగర్ ఫ్యాక్టరీ మను గడకు సహకరించకపోతే ఎలా? షుగర్ ఫాక్టరీని మూత వేయించి స్పిన్నింగ్ మిల్‌లా వేలంపాటలో కొనుగోలు చేయాలనుకొంటే రైతులు చూస్తూ ఊరుకోరు.

వి.నిరంజన్‌రెడ్డి చెర్లోపాళెం

ఆస్తులు వెల్లడించని నేతలు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు తన ఆస్తులు, భార్యా బిడ్డల ఆస్తులు ఇటీవల ప్రకటించాడు. వైఎస్ రాజశేఖరెడ్డి ఆస్తులు ఏదో విధంగా బయట పడుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గంలో ఏడుగురు మంత్రులే ఆస్తుల వివరాలు ప్రకటించారు. మిగిలినవారి సంగతేమిటి? ఎమ్మెల్యేలు ఆస్తుల ప్రకటనకు దూరంగా వున్నారు. ఎమ్పీలు వారిననుసరిస్తున్నారు. తెలంగాణ ఉద్యమం పేరిట వందల కోట్ల రూపాయల ఆస్తులు సమకూర్చుకొన్న టిఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు కూడా ఆస్తుల వివరాలు ప్రకటించలేదు. ప్రజాప్రతినిధులందరూ తమ ఆస్తులు ప్రకటించేలా లోక్‌సభ, అసెంబ్లీ స్పీకర్లు తగిన ఆదేశాలిస్తే బాగుంటుంది.

కె.పెంచలయ్య నెల్లూరు

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

24-10-1941
పేజీలు : 12 వెల: అణా

దశరా గలాటా విచారణ

23వ తేది శెలవు. విచారణ లేదు. 23వ తేది పది మంది మహమ్మదీయులను, ఒక క్రైస్తవుని విచా రించారు. వీరు మసీదుల ఎదుట మేళతాళములతో పాయ్యే వాదుకలేదని, 1919లో మేళతాళములతో ఉత్సవం జరిగిందని, అందువల్ల రైటింగు జరిగిందని, దశరా తర్వాత మహమ్మదీయుల జట్కా ఎక్కకుం డుట, ఉద్యోగంనకు నిలిపివేయుట, వస్తువులు కొనకయుండుట మున్నగు బహిష్కరణ జరిగిందని చెప్పిరి.

క్రైస్తవ సాక్షి, క్రైస్తవ దేవాలయముల వద్ద కూడా వాయిద్యాలు నిలుపుతారని చెప్పినాడు.

24వ తేది ఇద్దరు మహమ్మదీయుల విచారణ వుంది. తర్వాత అధికార్ల పక్ష సాక్ష్యమును విచారింతురు.

రహస్య ఉత్తరాలు

సూతుండు శౌనకాది మహామునులకు చెప్పినట్లు పరీక్షన్నరేంద్రునకు కాళయ్య యిట్లని చెప్పం బొడంగె :–

కోవూళ్లో రహస్య ఖర్చు ఒక బాపతు 400 రూపాయలు. మరో బాపతు 700 రూపాయలు.
700 రూపాయల ఆ పెద్ద మనిషి పేరు ఖరాబుచేసి సంధానకర్త, సంభావనకర్త కాజేశారయా!
కావలి మిత్రునికియ్యాలని మరొక పద్దు వెయ్యి రూపాయలు అడుగుతున్నారట మిము.
అది హుళక్కే గాక మోసమని కూడా మార్కండేయుడు నారద మహామునికింజెప్పె.
ఇది సూతప్రోక్త రామయణాంతర్గత పిడకల వేట్లాట.

50 ఏళ్ల క్రితం ఈవారం

20-10-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

డాక్టర్ గోపాలరెడ్డి ఎలక్షన్ ప్రచారం

"లోక్‌సభకు ప్రప్రథమ పర్యాయం నేను పోటీజేయ నిశ్చయించాను. కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేశాను. బహుశా నేనే అభ్యర్థిగా నిర్ణయింపబడగలను. లోక్‌సభలో మీ ప్రతినిధిగా ఉండుటకు వీలుంటే మంత్రిగా ఉండుటకు ఆశీర్వదించండి" అని కేంద్ర వర్కు శాఖ మాత్యులు డాక్టరు బెజవాడ గోపాలరెడ్డి గారు కావలి పార్లమెంటు నియోజకవర్గ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గోపాలరెడ్డి 15వ తేది తన ఎలక్షన్ ప్రచారం ప్రారంభించారు. కావలి, కోవూరు తాలూకాలలో పర్యటించారు. ప్రణాళికల ప్రాశస్త్యాన్ని వివరిం చారు. ఆ ప్రయత్నంలో కాంగ్రెస్‌తో సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. మహిమాన్వితమైన నెహ్రూ నాయకత్వాన్ని దేశ సౌభాగ్యం కొరకు నిల్పవలసిందిగా కోరారు.

నెల్లూరు ముచ్చట్లు
కావలి కాల్వ శంకుస్థాపన స్థల నిర్ణయం

కావలి కాల్వ శంకుస్థాపనకు తగిన స్థలం సూచించవలసిందిగా గోపాలరెడ్డి గారు కోరిన దానిపై కావలికి 4 మైళ్ల దూరంలో పెదపవని వద్ద కాలువ క్రాస్‌చేసే చోటు తగినదని, ఎక్కువ మంది ప్రజలు పాల్గొనుటకు, భోజనాది సౌకర్యాలకు ఈ స్థలం అత్యంత అనుకూలమైనదని, దీనికి కావలి తాలుకా ప్రముఖులందరూ సుముఖులని ఒక పరిశీలకుడు వ్రాస్తున్నారు.

రంగనాధస్వామి ఆలయం

మరుపూరు కోదండరామరెడ్డి, పత్తి నరసింహం, కామిశెట్టి ఆదిశేషయ్య గారలు నెల్లూరు రంగనాథ స్వామి ఆలయ ధర్మకర్తలుగా నియమింపబడి, అందులో నరసింహం మేనేజింగ్ ట్రస్టీగా ఎన్నుకోబడినారట.

నెల్లూరు ముచ్చట్లు

నెల్లూరులో హంటా వైరస్

కొత్త రకాల వ్యాధులు నెల్లూరులో పురుడు పోసుకొంటున్నాయి. కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతుండిన పడుగుపాడుకు చెందిన నాజున్నీ హైదరాబాద్‌లోని గ్లోబల్ ఆసుపత్రిలో మరణించగా ఆమెకు ఎలుకల వల్ల సంక్రమించే హంటా వైరస్ వచ్చినట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులకు తెలియజేసినా వారు ఎప్పటిలానే ఏమీలేదని సమస్యను తక్కువచేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

కావలికి చెందిన ఓ బాలిక 'కంఠసల్పి'తో బాధపడుతూ గుంటూరు జనరల్ ఆసుపత్రిలో మరణించింది. కంఠసల్పి ఎప్పుడో అంతరించి పోయిందని ప్రభుత్వం ప్రకటించగా నేనున్నానంటూ మళ్లీ పలకరించి వణికిస్తుంది. అక్టోబర్, నవంబర్, డిశంబర్ నెలలు వ్యాధులకు సీజన్ కావడంతో డెంగీ జ్వరం, మెదడువాపు వ్యాధులు విజృంభించే అవకాశముంది. వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని స్థాయిల్లోని వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే సరికొత్త, సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలకు ఉపశమనం లభిస్తుంది.

సిఐడి విజయకుమార్ పైనే ఆశలు!

జిల్లాలో ఐదొందల కోట్ల రూపాయలకు పైగా వ్యాపార కార్యకలాపాలు జరిగిన మనీ సర్క్యులేషన్ స్కీం దర్యాప్తు బాధ్యతలను సిబిసిఐడి విభాగం స్వీకరించింది. నెల్లూరు జోన్‌లో ఈ విభాగం బాధ్యతలు నిర్వహించే డిఎస్పీ విజయకుమార్ రంగంలోకి దిగి న్యూవిజన్ ఫౌండేషన్, హిమ్ సంస్థలకు సంబంధించిన కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు హడావుడిగా అరెస్ట్ చేసి కావలి సబ్ జైలుకు తరలించి రాచమర్యాదలు చేస్తున్న హిమ్ సంస్థ నిర్వాహకుడు జాన్‌ప్రభాకర్‌ను తమ కస్టడీకి అప్పగించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసి అదుపులోనికి తీసుకొన్నారు. ఈ వ్యవహారాన్ని పరిశీలించేందుకు సిఐడి ఎస్పీ రాథోడ్ కూడా నెల్లూరు వస్తున్నారు. జిల్లాలో ఈ కేసును విచారించే విజయకుమార్‌కు సమర్థుడైన అధికారిగా పేరుంది. కెరీర్ ప్రారంభంలో బిట్రగుంట ఎస్ఐగా పనిచేసిన విజయకుమార్ ఇక్కడి కరుడుకట్టిన తిప్ప నేరస్తులను ఎన్‌కౌంటర్ చేసి పేరుగాంచారు. తన సామాజిక వర్గంకు సంబంధించిన సంస్థలే మనీ సర్క్యులేషన్ స్కీంలో ప్రధాన నిందితులుగా వున్నా ఆయన గట్టిగా శోధించి ప్రజల డబ్బు వారి చేతికందేలా కృషి చేస్తారన్న నమ్మకం వుంది.

మూయని డాబాలు... బార్లు

జిల్లాలో జాతీయ రహదారి వెంబడి నడుస్తున్న డాబాల్లో మద్యం అమ్మకాలు జరుగకుండా చూడమని సాక్ష్యాత్తూ డిజిపి వేణుంబాక దినేష్‌రెడ్డి ఆదేశించినా వాటిని అమలుచేసే పోలీసు అధికారులే కరువయ్యారు. బార్లు, బ్రాందీషాపులు ఖచ్చితమైన సమయానికి మూతపడేలా చేయమన్నా దీనికి దిక్కులేకుండా పోయింది. డాబాలు, బ్రాందీషాపులు, బార్లు పోలీసుల ఆదాయ వనరులు. వీటిని ఎవరు చెప్పినా వారు కట్టడి చేయరేమో దినేష్‌రెడ్డి గారూ.

ఎస్-2లో భలే రేట్లు!

నెల్లూరులో గత వారం ప్రారంభించిన ఎస్-2 మల్టీప్లెక్స్ థియేటర్లలో తినుబండారాల రేట్లు మరీ ఎక్కువగా వున్నాయి. మినీ సైజు పాప్‌కార్న్ 35 రూపాయలు, ఓ ప్లాస్టిక్ గ్లాసులో ఇచ్చే కోక్‌కు 45 రూపాయలు వసూలు చేస్తున్నారు. హాట్ పఫ్ ఒక్కటే 25 రూపాయలకు దొరికే చవక తినుబండారం. చిత్రవిచిత్రమైన పేర్లతో దొరికే తినుబండారాలు 250 రూపాయల వరకు రేట్లు పలుకుతున్నాయి. టిక్కెట్ కన్నా తినుబండారాల రేట్లు ఎక్కువవుంటే ఎలా?

నిలచిన చిల్డ్రన్ పార్కు రోడ్డు పని!

చిల్డ్రన్ పార్కు రోడ్డు విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలచిపోయాయి. ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన చిన్న కంకర, తారు మిశ్రమం కలిపిపోసిన గుట్టలు నాలుగు నెలలుగా అక్కడే దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ మార్గాన నగరంలోకి రాకపోకలు సాగించేవారు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఈ పనిని అర్థాంతరంగా ఎందుకు నిలిపేశారో చెప్పేవారు లేకుండా పోయారు.

కంభంకు కాంగ్రెస్ కండువా!

ఉగయగిరి మాజీ శాసనసభ్యుడు కంభం విజయరామిరెడ్డి ఆనం బ్రదర్స్ నేతృత్వంలో హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయనకు ముప్పన్నెల్ల కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పిసిసి అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణను సైతం కంభం మర్యాద పూర్వకంగా కలిశారు.

బారాషహీద్ దర్గాలో నిషాన్!

నెల్లూరు బారాషహీద్ దర్గాలో ఎత్తైన గుమ్మటం(నిషాన్) పనులు గత ఏడాది మొహరం నుంచి జరుగుతూనే వున్నాయి. ఈ యేడాది రొట్టెల పండుగ నాటికి దీన్ని సిద్ధం చేసేట్లున్నారు. నిషాన్ దర్గాకు అదనపు శోభ కూర్చినా ఈ పనులను నత్తనడకన చేయడం వల్ల దర్గాకు ప్రతినిత్యం వెళ్లే భక్తులు ఇబ్బంది పడక తప్పడం లేదు.

రోశయ్య రాక

తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య మళ్లీ నెల్లూరు పర్యటనకు విచ్చేశారు. 16వ తేది సూళ్లూరుపేట చెంగాళమ్మ దేవస్థానం ప్రాంగణంలో ఆయనకు పౌర సన్మానం జరిగింది. అదే రోజు రాత్రి కావలికి వెళ్లి బసచేసిన ఆయన మరుసటి రోజు ఒంగోలు మాజీ ఎమ్పీ మాగుంట సుబ్బరామరెడ్డి, చక్కా సత్యనారాయణ గుప్తా విగ్రహాలు ఆవిష్కరించారు. అనంతరం జొన్నవాడ కామాక్షమ్మను సందర్శించిన ఆయన పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. రాత్రి కలెక్టర్ బంగ్లాలో విందుచేసిన రోశయ్య చెన్నై బయలుదేరి వెళ్లారు.



నెల్లూరు చిత్రకారుడు అమీర్ జాన్‌కు అసిస్ట్ అవార్డును అందజేస్తున్న పాండిచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి.

చంద్రమౌళినగర్‌లో చోరీ

నెల్లూరు నగరంలో దొంగల స్వైరవిహారానికి అడ్డుకట్ట పడడం లేదు. దర్గామిట్టలోని చంద్రమౌళినగర్ ఏడవ వీధిలో నివసించే ఎస్.వేణుగోపాలరెడ్డి ఇంటికి తాళం వేసి ముత్తుకూరుకు వెళ్లగా 15వ తేది ఈ ఇంటిని దొంగలు దోచేశారు. ఆరు లక్షలు విలువచేసే 29 సవర్ల బంగారం చోరీ అయినట్లు వేణుగోపాలరెడ్డి ఐదవ పట్టణ క్రైం పోలీసుల కిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


ఖజానా శాఖ డిడిగా నాగమాంబ

నెల్లూరు ఖజానా శాఖ ఉప సంచాలకురాలిగా నాగమాంబ బాధ్యతలు స్వీకరించారు. నాగమాంబకు సర్వీసంతా ఖజానా శాఖలోనే కొనసాగింది. ఆర్థిక శాఖలో అకౌంటెంట్‌గా వుంటూ నెల్లూరుకు బదలీ అయి వచ్చారామె.

రాజరాజేశ్వరమ్మ సేవకు కొత్త కమిషనర్!

నెల్లూరు రాజరాజేశ్వరమ్మ దేవ

కొరవ 14వ పేజీలో








వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో రచ్చ!

చిచ్చుపెట్టిన నియోజకవర్గాల ఇన్‌చార్జీల ప్రకటన


కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.


ఆనం వెంకటరమణారెడ్డి.


రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి.


కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి.

పుడిపుడే ప్రాణం పోసుకొంటున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో అప్పుడే రచ్చలు మొదలయ్యాయి. ఈ రచ్చలకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రకటించినట్లు చెబుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోస్టులే కారణం కావడం విశేషం. నెల్లూరు నగర నియోజకవర్గానికి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి నియోజకవర్గానికి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గానికి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు మేకపాటి బ్రదర్స్, సర్వేపల్లి నియోజకవర్గానికి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలను ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్లు ఆ పార్టీ వర్గాల్లోనే ప్రచారం జరుగుతుంది. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలకు మాత్రం ఎవరినీ ఇన్‌చార్జీలుగా నియమించలేదు. తనను నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జగన్ పనిచేసుకోమన్నాడని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించిన వెంటనే ఆనం వెంకటరమణారెడ్డి నొచ్చుకొన్నట్లు తెలిసింది. మేకపాటి గౌతమ్‌రెడ్డి ద్వారా తన ఆవేదనను ఆయన జగన్ దృష్టికి తీసుకవెళ్లారట. అయితే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలో గడప గడపకు పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ యాత్ర వంద రోజులపాటు చేస్తానన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో స్వల్ప తేడాతో ఓడిపోయిన వెంకటరమణారెడ్డి క్యాడర్‌ను నిలుపుకోలేకపోయారన్న విమర్శను ఎదుర్కొంటున్నారు. కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని నియమించడంపై కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరుల్లో ఆవేదన రగిలింది. విష్ణును ఎమ్మెల్సీ బరిలో పెడతామని జగన్ చెప్పినట్లు ఆ పార్టీ వర్గాలలో చర్చ జరుగుతుంది. మొత్తంమీద నెల్లూరు రూరల్, కావలి నియోజకవర్గాల్లో రేగిన ఈ గొడవ టీ కప్పులో తుఫాన్‌లా సద్దుమణుగుతుందా? ఇంకా పెద్దదవుతుందా అనే దానికి కాలమే సమాధానం చెబుతుంది.

మెయిన్ రోడ్డులో మరమ్మత్తులు ఎన్నాళ్లు?


శబరి శ్రీరామక్షేత్రం వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు.


రోడ్డుపై తొలగించని డివైడర్ల పైపులు.

నెల్లూరు ట్రంకురోడ్డులో కొన్ని ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ, మరు రెండు చోట్ల తూముల నిర్మాణమంటూ మూడు నెలలుగా పనులు నత్తనడకన సాగుతుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. బొల్లినేని హాస్పిటల్ ప్రాంతం నుంచి రాజరాజేశ్వరమ్మ దేవస్థానం వరకు ట్రంకురోడ్డు విస్తరణ పనులు చేద్దామా... వద్దా అనే తీరులో చేస్తున్నారు. హాస్పిటల్ వద్ద నుంచి శబరి శ్రీరామక్షేత్రం వరకు రోడ్డు మధ్యలో వున్న డివైడర్‌లను తీశారు తప్ప క్రింది భాగంలోని ఐరన్ రాడ్‌లను తీయకపోవడం వల్ల రాత్రివేళల్లో ఇవి కానరాక వాహనాలు వీటి పైకి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. పెద్దాసుపత్రి వద్ద, కొండాయపాళెం సెంటర్‌లో గత ఆరు నెలలుగా ట్రంకురోడ్డుపై తూముల నిర్మాణం పని సాగుతూనే వుంది. దీనివల్ల ఈ ప్రాంతంలో వన్‌వేలో వాహనాలు ప్రయాణం సాగించాల్సి వస్తుంది. రోడ్డు విస్తరణ పనులు, తూముల నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో చిన్నపాటి హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడం గమనార్హం. ఇంత నిర్లక్ష్యం అధికారులకు తగదు. ముఖ్యమైన ఈ పనులను త్వరితగతిన నాణ్యతాపరంగా చేయించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై వుంది.

• దుస్థితిలో
నెల్లూరు రిజిస్ట్రేషన్ ఆఫీసు

కనీస సౌకర్యాలు కరవు


నెల్లూరు రిజిస్ట్రార్ ఆఫీసు. (ఇన్‌సెట్‌లో పగిలిన శ్లాబు)

ప్రభుత్వానికి అత్యంత ఆదాయం తీసుకొచ్చే శాఖల్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. ఈ శాఖ ద్వారా ప్రతి ఏడాది కోట్ల రూపాయల రాబడి వస్తుంది ప్రభుత్వానికి. అలాంటి రిజిస్ట్రార్ కార్యాలయం పరిస్థితి గమనిస్తే ఆదాయం అధికం వసతులు పూజ్యం అన్న చందంగా వుంది. నగరంలోని కోర్టు ప్రాంగణంలో గల ఈ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకొని వుంది. ఎప్పుడో 110 ఏళ్ల క్రిందట కట్టించిన కార్యాలయంలోనే ఈనాటికీ కొనసాగుతుండడంతో సిబ్బందితోపాటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిత్యం కోట్ల రూపాయల క్రయవిక్రయాలకు కేంద్రంగా గల ఈ కార్యాలయంలో ఎలాంటి సదుపాయాల్లేవు. చిన్న చిన్న కార్యాలయాలు కార్పొరేట్ హంగులను ఏర్పరచుకొంటుంటే ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చిపెట్టే రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రం శిథిలమైన భవనంలో అరకొర వసతుల నడుమ నెట్టుక రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం మూడువేల చదరపడుగుల విస్తీర్ణంలో మాత్రమే వున్న ఈ కార్యాలయానికి ప్రతిరోజు జిల్లా నలుమూలల నుంచి పొలాలు, స్థలాలు, వివాహాలు, ఇళ్లు రిజిస్ట్రేషన్ కోసం ఎంతోమంది వస్తుంటారు. అలాంటి వారికి కూర్చొనేందుకు కుర్చీలు, బల్లలు లేవు. తాగడానికి మంచినీటి సౌకర్యం లేకతీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. మరోవైపు పార్కింగ్ సమస్యధికంగా వుంది. దాదాపు రెండేళ్ల నుంచి సిబ్బంది కొరత వుంది. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వున్న ఈ ప్రాంగణంలో శిథిలమై పోయిన భవనం ఎప్పుడు కూలుతుందోనన్న భయం సిబ్బందితోపాటు అక్కడకు వచ్చే వినియోగదారులకూ వుంది.

యువ కిరణాలకు అడ్డంకులు

రేషన్‌కార్డు ఉంటేనే దరఖాస్తు

జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పన మార్కెటింగ్ జనరేషన్‌లో ఉద్యోగావకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ కిరణాలకు ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఈ పథకం అమలు కోసం ఇప్పటివరకు ఎంతో ఆశతో ఎదురుచూసిన నిరుద్యోగులు ప్రభుత్వం విధించిన నిబంధనలను చూసి అవాక్కవుతున్నారు. ఉపాధి కల్పన కోసం దరఖాస్తు చేసే ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా రేషన్‌కార్డు కలిగి వుండడంతోపాటు మొబైల్ నెంబర్‌ను కూడా నమోదు చేయాల్సి వుంటుంది. రేషన్‌కార్డు లేకుంటే దరఖాస్తును తిరస్కరిస్తారు. జిల్లావ్యాప్తంగా కొన్ని వేల మందికి రేషన్ కార్డులులేవు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు సమర్పించి సంవత్సరం గడుస్తున్నా వీటి గురించి పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డులు జారీచేయలేని ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించే సమయంలో రేషన్‌కార్డు తప్పనిసరని పేర్కొనడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈ నిబంధన కారణంగా అనేక మంది రాజీవ్ యువ కిరణాలకు అనర్హులుగా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ నిబంధనను తొలగించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

నెల్లూరంటే నాకు భయం!

◆ మరుపూరు అవార్డు ప్రదాన సభలో మాలతీచందూర్


మాలతీ చందూర్‌ను సన్మానిస్తున్న వెన్నెలకంటి, మురళీకృష్ణ హజరత్‌బాబు.

ప్రముఖ సాహితీవేత్త మరుపూరు కోదండరామిరెడ్డి సాహితీ అవార్డు ప్రదాన కార్యక్రమం టౌన్‌హాలులో అక్టోబర్ 16న హృద్యంగా సాగింది. విఖ్యాత సాహితీ విమర్శకురాలు మాలతీ చందూర్‌కు ఈ అవార్డును అందజేశారు. అవార్డు అందుకొన్న సందర్భంగా మాలతీ చందూర్ మాట్లాడుతూ మరుపూరు అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. బెజవాడ గోపాలరెడ్డితో తమ కుటుంబానికి సన్నిహిత సంబంధాలున్నాయని వారు మద్రాస్‌కు వచ్చినప్పుడు తమ ఇంటికి వచ్చి వెళ్లేవారని గుర్తు చేసుకొన్నారు. సాహిత్య విశేషాలు తమతో పంచుకొనేవారన్నారు. ఎందరో లబ్ధప్రతిష్టులైన కవులు, సాహితీవేత్తలు, కళాకారులు పుట్టిన గడ్డైన సింహపురి నగరమంటే తనకు మొదట్నుంచి కొంత భయం వుందన్నారు. అందుకు కారణం పలువురు ఆయా రంగాల్లో ఉద్దండులు కావడమేనని, ఇప్పటికీ నెల్లూరంటే ఆలోచిస్తుంటానన్నారు. పెద్ద కుర్చీ, గజమాలతో సత్కరించడంపై తనదైనశైలిలో మాట్లాడుతూ మల్లాది వారు చెప్పినట్లు కృష్ణాజిల్లా వాళ్లు మొదట గౌరవ మర్యాదలకు పెద్ద పీట వేస్తారని, తనకు కిరీటం, గజమాల వేయడం ఆ మాటలను గుర్తుచేస్తున్నాయన్నారు. గత 60 ఏళ్లుగా వ్రాసి ఎంత మందిని బాధపెట్టానోనన్నారు. అలాగే 40 ఏళ్లుగా అడగండి చెబుతా అనే శీర్షికను నిర్వహిస్తున్నానని తెలిపారు. మద్రాస్ నగరంలో అన్నాదొరై, ఎంజిఆర్ విగ్రహాలే కాదని అక్కడా తెలుగువాడు, ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఉందని, తామే నెలకొల్పామన్నారు. నెల్లూరు జిల్లా వారు ఆ విగ్రహాన్ని ఒక్కసారైన దర్శించాలన్నారు. ఎన్ని అవార్డులు, రివార్డులు వచ్చినా అన్నీ ఒదిగి వుండాలని హెచ్చరిస్తుంటాయన్నారు.

● నత్తనడకన

రెవిన్యూ రికార్డుల కంప్యూటరీకరణ!

జిల్లాలోని 46 మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో రెవిన్యూ రికార్డుల కంప్యూటరీకరణకు ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఏడాది అవుతున్నా ఇంత వరకు ఏ రికార్డునూ కంప్యూటరీకరించలేదు.

భూమి హక్కులకు సంబంధించి రైతులకు త్వరితగతిన రెవెన్యూ ధృవీకరణ పత్రాలు అందజేయాలన్న ఆశయం నెరవేరకుండాపోతుంది. వ్యవసాయానికి అవసరమైన బ్యాంకు రుణాలు పొందేందుకు పట్టాదారు పాసుబుక్‌లతోపాటు, అడంగళ్ పత్రాలు అవసరం అవుతాయి. వీటిని రెవెన్యూ అధికారుల నుంచి పొంది బ్యాంకు అధికారులకు సమర్పిస్తే వాటిని పరిశీలించి అవసరమైన రుణాన్ని మంజూరు చేస్తారు. గత సంవత్సరం నుంచి రెవెన్యూ రికార్డులను కంప్యూటరీకరణ చేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశిస్తున్నా మన జిల్లాలో ఈ కార్యక్రమం ఆశించిన మేర ముందుకు సాగడం లేదు.

జిల్లాలోని 46 మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ రికార్డుల కంప్యూటరీకరణకు ప్రత్యేకంగా కంప్యూటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామాల్లో పని చేస్తున్న విఆర్వోల వద్దనున్న భూమి హక్కులకు సంబంధించి అన్ని రికార్డులను తెప్పించుకొని కంప్యూటర్‌లో వివరాలు నమోదు చేయాల్సి వుంటుంది. అయితే కొందరు విఆర్వోల వద్ద నేటికి ఆయా ప్రాంతాల్లోని భూములను గుర్తించే వివరాలు లేకుండా పోయాయి. మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు సక్రమంగా పని చేయని పరిస్థితి కూడా ఏర్పడింది. మండలంలో పని చేసే విఆర్వోలందరూ వారి వద్దనున్న రికార్డులను తీసుకొచ్చి గంటల తరబడి కంప్యూటర్ వద్ద నిరీక్షణ చేయాల్సి వస్తుంది.

తహశీల్దార్ కార్యాలయంలో నిరీక్షణ చేయలేని విఆర్వోలు బయట కంప్యూటర్ కేంద్రాలను ఆశ్రయించి వివరాలు నమోదు చేయిస్తున్నారు. విద్యుత్ కోత కారణంగా మరింత జాప్యం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు మాత్రం తమ భూమి హక్కులకు సంబంధించి ధృవీకరణ పత్రాల మంజూరుకు ప్రజాసేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ధృవీకరణ పత్రాల జారీ కోసం నిర్ణయించిన రుసుం కూడా చెల్లించి నెలల తరబడి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ధృవీకరణ పత్రాల గురించి ప్రజాసేవ కేంద్రం సిబ్బందిని ప్రశ్నిస్తే కంప్యూటర్‌లో వివరాలు నమోదు కాలేదని సమాధానం చెబుతున్నారు. తిరిగి గత్యంతరం లేక విఆర్వోల వద్దకెళ్లి అడంగళ్ నకలు కోసం అభ్యర్థించక తప్పడం లేదు.

జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొని వుంది. కంప్యూటర్లు సక్రమంగా పని చేయకపోయినా, ఆపరేటర్ విధులకు హాజరు కాకపోయినా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రజలకు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలు ప్రజాసేవ కేంద్రాల ద్వారా జారీ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ చేసిన ప్రకటన కేవలం కాగితాలకే పరిమితమై పోయింది. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాసేవ కేంద్రాల ద్వారా ఎన్ని రకాల ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు? ఎంత మంది దరఖాస్తు చేస్తున్నారు? సకాలంలో అధికారులు జారీ చేస్తున్నారా? లేదా అన్న విషయాన్ని ఏ అధికారి కూడా తనిఖీ చేయడం గానీ, పరిశీలించడం చేయలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు సకాలంలో ధృవీకరణ పత్రాలు అందక ఇబ్బంది పడుతున్నారు.



నెల్లూరు ఎమ్మార్వో ఆఫీసులో రికార్డుల కంప్యూటరీకరణ జరిగేదిక్కడే...

జిల్లావ్యాప్తంగా వ్యవసాయసాగు చేసే రైతులకు ప్రధానంగా భూమిహక్కులను తెలిపే రికార్డులు అవసరం కానున్నాయి. కంప్యూటరీకరణ చేసిన రికార్డులనే అందిస్తామని చెబుతున్న రెవెన్యూ అధికారులు ఆ దిశగా మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ రికార్డుల కంప్యూటరీకరణపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అవసరమైన పత్రాలు అందించేందుకు కృషి చేయాల్సిన అవసరం వుంది.

● వైద్యఆరోగ్యశాఖలో

కాంట్రాక్ట్ సిబ్బంది ఆకలి కేకలు!

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి 200 మంది సిబ్బంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారు. వీరికి శాశ్వత ప్రాతిపదికన నియమించే సిబ్బందిలా జీతాలివ్వమని హైకోర్టు ఆదేశించినా ఏదో ఒక మెలికపెట్టి ఆరు నెలలకొకసారి కూడా జీతాలివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది గత ఆరు నెలల నుంచి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం కాంట్రాక్టు సిబ్బంది వేతనాలకు సంబంధించిన నిధులను విడుదల చేసినా అధికారుల నిర్లక్ష్యవైఖరి కారణంగా వేతనాలు మంజూరు కాకుండా పోయాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో దాదాపు 200ల మంది కాంట్రాక్టు ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నారు. వీరిని రెగ్యులర్ చేయాలని పలు దఫాలుగా ఆందోళన కూడా చేయడం జరిగింది. అయినా రాష్ట్రప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు.

2002 సంవత్సరంలో కాంట్రాక్టు ప్రాతిపదికన వైద్య ఆరోగ్యశాఖలో చేరిన 100 మందిని అధికారులు విధుల నుంచి తొలగించారు. అధికారుల తీరును తప్పుబడుతూ రాష్ట్ర హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకొని వారు విధుల్లో చేరారు. అప్పటి నుంచి వీరికి సక్రమంగా వేతనాలు అందకుండాపోయాయి. ప్రతి సంవత్సరం కాంట్రాక్టు సిబ్బంది కాలపరిమితిని పొడిగిస్తున్నట్లు సంబంధితశాఖ అధికారులు ఖజానా అధికారులకు ఉత్తర్వులు అందజేయాల్సి వుంటుంది. ప్రభుత్వం నుంచి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అందితేనే జీతాలిచ్చే వారు. కాంట్రాక్టు సిబ్బంది కాలపరిమితిని పొడిగిస్తున్నట్లు ఖజానా అధికారులకు ఉత్తర్వులు అందడంలో ఏమాత్రం జాప్యం జరిగినా వేతనాలు మంజూరు చేయడం నిలిపివేస్తుంటారు. ఈ సంవత్సరం మే నెల నుంచి సెప్టెంబర్ వరకు వేతనాలు మంజూరు కాలేదు. ఈ వేతనాలు మంజూరు కాకపోవడంపై అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వం నుంచి కాల పరిమితి పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు రాలేదని సమాధానం చెబుతున్నారని కాంట్రాక్టు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సకాలంలో ఉత్తర్వులు తెప్పించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని వాపోతున్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయకపోగా వేతనాల విషయంలో కూడా తీరని అన్యాయం జరుగుతోంది.

రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న వారికి అందించే సదుపాయాలు కాంట్రాక్టు ఉద్యోగులకు దక్కడం లేదు. అత్యవసర సమయంలో కాంట్రాక్టు సిబ్బందిని వినియోగించుకుంటారు. ప్రధానంగా మహిళా ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఒక ప్రక్క ఉద్యోగ భద్రత లేక మరోప్రక్క ప్రతినెల వేతనాలు అందక తాము ఎలా జీవనం సాగించాలని ప్రశ్నిస్తున్నారు. వేతనాల మంజూరు కోసం అవసరమైతే రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాలన్న ఆలోచనలో వున్నారు. 2007 సంవత్సరంలో మరో 65 మంది హైకోర్టుకెళ్లి విధుల్లో కొనసాగే విధంగా ఉత్తర్వులు తెచ్చారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగ నియామకం జరిగేటప్పుడు విధించిన నిబంధనలు సక్రమంగా లేకపోవడంతో హైకోర్టుకు వెళుతున్నారు.

ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లిన ప్రతిసారి వారికి అనుకూలంగానే తీర్పు వెలువడింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు పలుమార్లు మార్గదర్శకాలు జారీ చేసినా వాటిని సక్రమంగా అమలు చేయడం లేదు. శాఖాపరమైన వివిధ కారణాల చేత కాంట్రాక్టు సిబ్బంది రెగ్యులరైజ్‌కు నోచుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా ఆశాఖ జిల్లా అధికారులు స్పందించి కాంట్రాక్టు సిబ్బంది వేతనాల మంజూరుకు కృషి చేస్తే మంచిది.





నెల్లూరీయుడు తుంగా పాండురంగారెడ్డి హైదరాబాద్‌లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో నిర్వహించిన లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ జయంత్యుత్సవాలలో పాల్గొన్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, బండారు దత్తాత్రేయ, వెంకయ్యనాయుడు, డాక్టర్ జయప్రకాష్ నారాయణ.



యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథములుగా నిలచిన నెల్లూరు శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ పద్మావతి చౌదరి.



హైదరాబాద్‌లో జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరుజిల్లా నియోజకవర్గాల సమీక్షా సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని కలసి అభినందిస్తున్న గూడూరు డివిజన్ నాయకుడు పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి.



ఒంగోలు ఎమ్పీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు విశ్వభారతి అంధుల పాఠశాలలో పిల్లల చేత కేక్ కట్ చేయించి తినిపిస్తున్న ప్రమిద శ్రీనివాసులు, కరేడు శ్రీనివాసులు బృందం.

సంచార వ్యభిచారం

బీచ్‌లలో బేవార్స్ ముఠాలు

జిల్లాలో వివిధ ప్రాంతాలలో వ్యభిచార ముఠాల సంచారం అధికంగా వుంటోంది. జాతీయ రహదారితోపాటు సముద్రతీర ప్రాంతాల్లో తిరుగుతూ గుట్టు చప్పుడు కాకుండా తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు సమాచారం. పోలీసులు ఎన్ని చర్యలు చేపడుతున్నా జాతీయ రహదారిపై వీరి ఆగడాలు శృతిమించడంతోపాటు బయటి ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొనివచ్చి విచ్చలవిడిగా వ్యభిచారం చేయించే ముఠాలు అధికం అయ్యాయి. కావలి ప్రాంతంతోపాటు రామాయపట్నం, మైపాడుబీచ్, కోడూరు బీచ్, ఉదయగిరి, సూళ్ళూరుపేట, తూపిలిపాళెం బీచ్ తదితర ప్రాంతాల్లో వ్యభిచారం జోరుగా సాగుతోంది. వాహనాలలో వచ్చి ఇక్కడ విచ్చలవిడిగా ప్రవర్తిస్తుండడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. సముద్ర తీరానికి వెళ్లే పర్యాటకులు, సందర్శకులకు వ్యభిచారుల వలన తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయి. కుటుంబసభ్యులతో కలసి సరదాగా గడిపేందుకు వెళ్లే వారిలోని మహిళలను వ్యభిచారులనుకొని అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో గొడవలు జరుగుతున్నాయి. అలాగే జాతీయ రహదారిపై వివిధ పనులకు వెళ్లి వచ్చే వారిని, కూలీలను లారీ డ్రైవర్లు ఇలాగే భావించి గందరగోళం చేస్తుండడంతో వారు ఎవరికి చెప్పుకోలేక వాపోతున్నారు. బస్టాండ్లలో వేచి వుండే ప్రయాణీకులకూ ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పోలీసులు ఇలాంటి ముఠాలపై నిఘా వుంచి వ్యభిచారాన్ని అరికట్టాలని పలువురు కోరుకొంటున్నారు.

స్కూళ్లలో అదనపు గదులకు రూ.58.5 లక్షలు

కోవూరు ఎమ్మెల్యే వెల్లడి

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని వివిధ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి 58.5లక్షలు మంజూరయ్యాయని కోవూరు శాసన సభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. జొన్నవాడ, రేబాల, పల్లిపాళెం, ఇస్కపాళెం, చల్లాయపాళెం, వడ్డిపాళెం, పోలినాయుడు చెరువులోని ఉర్దుపాఠశాల, బుచ్చిరెడ్డిపాళెంలోని కాశీపాళెం, హౌస్‌తోట ప్రాంతంలో గల ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో గది నిర్మాణానికి 4.5లక్షల రూపాయలు మంజూరయ్యాయన్నారు. అలాగే పట్టణంలోని కాశీపాళెం, పోలినాయుడు చెరువు, ఎస్టీ కాలనీలోగల పాఠశాలల్లో రెండేసి గదులు నిర్మాణానికి తొమ్మిది లక్షలరూపాయలు మంజూరైనట్లు చెప్పారు. మొత్తం 13 అదనపు గదులను ఈ నిధులతో నిర్మిస్తున్నట్లు ప్రకటించారు.

కావలిలో మెగా లోక్ అదాలత్!

60 కేసులు పరిష్కారం

కావలిలో బార్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 60కేసులు పరిష్కారం అయ్యాయి. కావలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జరిగిన అదాలత్‌కు సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ ఛైర్మన్ పి.గురప్ప పాల్గొని కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న వివాదాలు, కేసులను లోక్ అదాలత్ ద్వారా ఖర్చు, కాలయాపన లేకుండా అంతిమ తీర్పును పొందవచ్చన్నారు. ఈ సేవలను వినియోగించుకొని త్వరితగతిన తీర్పులు పొందాలన్నారు. ఈ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి రాజవెంకటాద్రి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ నజీర్, అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, ఎపిపి వెంకటేశ్వరెడ్డి, టౌన్, రూరల్ సిఐలు శ్రీనివాసన్, కృష్ణకిషోర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది మాల్యాద్రి, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ ఇసి మెంబర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు. అదాలత్‌కు వచ్చిన ప్రతిఒక్కరికి ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి కావలి శాఖ ఆహారపొట్లాలు మంచినీటిని అందించారు.

● పోలేరమ్మ దేవస్థాన

అభివృద్ధికి 30 లక్షలు!

రాజ్యలక్ష్మమ్మ వెల్లడి

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయాన్ని 30లక్షల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ప్రకటించారు. పోలేరమ్మ గుడిలో పూజలు నిర్వహించిన ఆమె మాట్లాడుతూ పోలేరమ్మ పుట్టిల్లుగా భావించే కుమ్మరవీధిలో అలంకార మండపం, జీనుగలవారి వీధిలో ఆస్థాన మండపం, అమ్మవారికి నిమజ్జనం చేసే మల్లమ్మ గుడి వీధిలో కోనేరు, మండపాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనికోసం 30లక్షల రూపాయలను నేతల నుంచి సేకరించడం జరిగిందన్నారు. తిరుమల – తిరుపతి దేవస్థానం సహకారాన్ని కోరుతామని చెప్పిన ఆమె అభివృద్ధి పనుల నమూనాను పరిశీలించారు. అనంతరం ఆమె ప్రజాసమస్యలను తెలుసుకొన్నారు. మునిసిపాలిటీలో మంచినీటి సమస్య గురించి మాట్లాడుతూ దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. అక్కడ నుంచి బాలాయపల్లి వెళ్లిన రాజ్యలక్ష్మి రెవెన్యూ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి నెలా గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆమె వెంట పిసిసి సభ్యులు డాక్టర్ కమలాకర సాయి, మధుసూధనరెడ్డి, ఢిల్లీబాబు, సోజన్యారెడ్డి ఆలయకమిటి సభ్యులు తదితరులు వున్నారు.

థర్మల్ ప్రాజెక్ట్‌లను నిరసిస్తూ మానవహారం


గూడూరు ప్రజల సంఘీభావం

పర్యావరణానికి, ప్రజలకు ముప్పు కల్గించే థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను అడ్డుకోవాలని ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. అంకులపాటూరులో నిర్మించ తలపెట్టిన థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటును నిరసిస్తూ సిపిఐ, లోక్‌సత్తా, జన విజ్ఞాన వేదిక నాయకులు గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో మానవ హారం చేపట్టారు. వారు మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదిన అంకులపాటూరులో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కంపెనీ యాజమాన్యం ఆప్రాంతానికి చెందిన కొంతమందిని మభ్యపెట్టి ప్రాజెక్టుకనుకూలంగా మాట్లాడించారన్నారు. దీనిపై వ్యతిరేకంగా మాట్లాడిన వారిని స్థానికేతరులుగా చిత్రీకరించారని ఆరోపించారు. పర్యావరణానికి థర్మల్ ప్రాజెక్టుల వల్ల హాని కల్గుతుందని మేధావులు, పర్యావరణ శాస్త్రవేత్తలు ఘోషిస్తుంటే పట్టించుకోకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి ప్రజాసంఘాల నేతలపై దాడి చేయడం గర్హనీయం అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ఏకపక్షంగా జరిగిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, లోక్‌సత్తా, జనవిజ్ఞాన వేదికకు చెందిన ప్రభాకర్, కృష్ణయ్య, అంజిరెడ్డి, రాజేష్‌కుమార్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

క్వార్జ్ అక్రమ త్రవ్వకాలు!

సైదాపురం, కోట, చిల్లకూరులలో ఇదో దందా

గూడూరు డివిజన్‌లో క్వార్జ్ అక్రమ త్రవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. డివిజన్ పరిధిలోని సైదాపురం, కోట, చిల్లకూరు, మనుబోలు ప్రాంతాల్లో క్వారీల యజమాన్యాలు ప్రభుత్వం ఇచ్చిన మైనింగ్ లీజు పూర్తయినప్పటికీ యదేచ్ఛగా త్రవ్వకాలు జరుపుతున్నా మైనింగ్ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నిత్యం ఆయా ప్రాంతాల నుంచి త్రవ్వి తీసిన తెల్లరాయిని అక్రమంగా చెన్నైకు తరలించి లక్షలు గడిస్తున్నారు అక్రమ త్రవ్వకం దారులు. క్వార్జ్‌కు విపరీతమైన డిమాండ్ వుంది. వీటి ధర అమాంతంగా పెరిగిపోవడంతో మైనింగ్, రెవెన్యూ అధికారులతో లోపాయికారి ఒప్పందం పెట్టుకొని వ్యాపారులు యదేచ్ఛగా త్రవ్వి తరలిస్తున్నారు. తెల్లరాయిలో మూడు క్వాలిటీలు వుంటాయి. మొదటి రకం దానిని గ్లెన్నుగా పిలుస్తారు. దీని ధర 3వేల నుంచి 4వేల రూపాయల వరకు వుంటుంది. ఈ రకం క్వార్జ్ సైదాపురం, అనంతమడుగు ప్రాంతాల్లో లభిస్తుంది. రెండో రకంను గ్లాసి అంటారు. ఈ రకం సాధారణంగా అన్ని ప్రాంతాల్లోనూ లభిస్తుంది దీని ధర 2000 రూపాయల నుంచి 2500 రూపాయలు వరకు వుంటుంది. మూడవ రకంను సెమిగ్లాసిగా పిలుస్తారు. వీటి ధర 1200 నుంచి 1500 వందల వరకు వుంటుంది. వివిధ రకాల వస్తువుల్లో వినియోగిస్తుండడం, డిమాండ్ వుండడంతో పలువురు అక్రమంగా త్రవ్వి జేబులు నింపుకొంటున్నారు. వీరు విదిల్చే లంచాల మెతుకులకు అలవాటుపడిన సంబంధితశాఖల అధికారులు చూసీచూడనట్లుండడంతో అక్రమ త్రవ్వకాలు మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతున్నాయి.



పల్లెపాడు గాంధీ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య.

గూడూరులో మనీస్కీం బాధితుల ఆందోళన

మనీస్కీంలో పెద్దమొత్తంలో డబ్బులు వస్తాయని ఆశపడి నగదు చెల్లించిన బాధితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోలీసులను కలసి ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో గూడూరులో ఆందోళనకు దిగారు బాధితులు. అశోక్‌నగర్, శ్రీపొట్టిశ్రీరాములు పార్కు, బనిగిసాహెబ్‌పేట ప్రాంతాలకు చెందిన మూడు వందల మంది బాధితులు అంబేద్కర్‌నగర్‌లో నివాసముంటున్న ఏజెంట్ ఇంటి ముందు ధర్నాకు దిగారు. భారత్‌ప్రేమ్‌సదన్, న్యూవిజన్ పౌండేషన్‌లో డబ్బులు కట్టి మోసపోయామంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఏజెంట్ నిస్సహాయత వ్యక్తం చేయడంతో అక్కడ నుంచి గూడూరు గ్రామీణ, పట్టణ సిఐలు శ్రీనివాసులరెడ్డి, రాంబాబులను కలసి న్యాయం చేయాలని కోరారు.

బెల్టుషాపులపై మహిళల సమరం

మద్యం బెల్టుషాపులపై మరోమారు సమరశంఖం పూరించింది చిట్టమూరు మండలం గునపాటిపాళెం గ్రామానికి చెందిన నారీలోకం. పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంతో స్వయంగా నడుంబిగించారు. నాయుడుపేట, కోట మార్గంలో రాస్తారోకో చేపట్టిన మహిళలు మద్యం బెల్టుషాపులకు వ్యతిరేకంగా నినదించారు. దాదాపు మూడు గంటలపాటు ఆందోళన చేపట్టిన గ్రామానికి చెందిన మహిళలు ఆ మార్గం గుండా మద్యంలోడ్‌తో వెళ్తున్న ఆటోను వెంబడించి నిలిపివేశారు. ఈ సందర్భంగా గునపాటిపాళెం గ్రామ మహిళలు మాట్లాడుతూ 1500 జనాభా గల గ్రామంలో మూడు బెల్టుషాపులు కొనసాగుతున్నాయని, వీటిని మూయించాలని అధికారులకు చెప్పినా స్పందన లేకపోవడంతో తామే రంగంలోకి దిగామన్నారు. బెల్టుషాపులను ఇకపై గ్రామంలో జరగనివ్వమని శపథం చేశారు. నాయుడుపేట, చిట్టమూరు పోలీసులను రప్పించి మద్యం నిల్వలతో వున్న ఆటోను అప్పగించడంతోపాటు దగ్గరుండి దుకాణాలపై దాడులు చేయించారు.

కావలిలో గ్యాస్ సిలిండర్ల సెగ

కావలి నియోజక వర్గంలో గ్యాస్ సిలిండర్ల సరఫరా సక్రమంగా వుండకపోవడం, బ్లాక్ మార్కెట్‌కు అధికంగా తరలిపోతుండడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు సిలిండర్ల కోసం చెప్పులరిగేలా తిరగాల్సి వస్తోంది. బోగోలు, దగదర్తి తదితర ప్రాంతాలలో 12వేలకుపైగా గ్యాస్ కనెక్షన్లు వున్నాయి. గ్యాస్ వినియోగదారులు సిలిండర్ బుక్ చేయాలంటే 15కిమీ దూరంలో గల ముసునూరుకు వెళ్లాల్సి వస్తోంది. ముందుగా గ్యాస్ ఏజెన్సీకి విశ్వనాధరావుపేటలో 8 ఎకరాలు కేటాయించారు అధికారులు. కొద్దిరోజులు మాత్రమే అక్కడ తాత్కాలికంగా ఏజన్సీని ఏర్పాటుచేసిన నిర్వాహకులు అక్కడ నుంచి బుకింగ్ పాయింట్‌ను తరలించి ముసునూరు వద్ద ఏర్పాటు చేసుకొన్నారు. దీనిపై ప్రజలు పలుమార్లు అధికారులను కలసి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దీనికి తోడు సిలిండర్ల సరఫరాలోనూ అక్రమాలు చోటు చేసుకొంటుండడంతో వినియోగదారులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. గ్యాస్‌బుక్ చేసుకొన్నప్పటికీ నిర్ణీత సమయానికి సరఫరా చేయకుండా బహిరంగంగా అధికమొత్తాలకు అమ్ముకొంటున్నారు. దీనిపై వినియోగదారులు ఫిర్యాదు చేసినప్పటికీ పౌరసరఫరాలశాఖ అధికారులు ఆ ఏజన్సీ నిర్వాహకులపై ప్రేమ చూపిస్తుండడం వారు విదిల్చే లంచాల సొమ్ముకే నన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

• క్రీడలకు

ఆదరణ కరవు!

వెంకటగిరి పట్టణంలో పాఠశాల క్రీడలకు ఆదరణ కరువవుతోంది. ఔత్సాహిక క్రీడాకారులు, క్రీడలపట్ల ఆసక్తి గల విద్యార్థిని విద్యార్థులు వున్నప్పటికీ వారిని ఆ దిశగా ప్రోత్సహించే వారు కరువవడం, కనీస వసతులు మృగ్యం కావడంతో పాఠశాలల క్రీడలు ఆదరణ కోల్పోతున్నాయి. దీంతో ఆసక్తి గల క్రీడాకారులు నిరాశ చెందుతున్నారు. స్థానికంగా పలు విద్యాసంస్థలకు క్రీడా మైదానాలు వున్నా అవి ఉపయోగకరంగా లేవు. విశ్వోదయ ప్రభుత్వ కళాశాలలో గల క్రీడా మైదానంలో క్రికెట్ పిచ్, టెన్నిస్ కోర్టు, జిమ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అన్నీ కనుమరుగైపోయాయి. పైగా ఈ మైదానాన్ని అమ్మేందుకు ప్లాట్లు వేశారు. జడ్పీ బాలుర ఉన్నత

వెంకటగిరి క్రీడాచరిత్ర నాడు ఘనం - నేడు హీనం!

పాఠశాలలో క్రీడా మైదానం వున్నా అక్కడే బిసి బాలుర వసతి గృహ పనులకు స్థలం కేటాయించడంతో అసౌకర్యంగా వుంది. ఇక ఆర్‌విఎం హైస్కూలుకు విశాలమైన ఆట స్థలం వున్నా పట్టించుకొనే వారు లేక ముళ్లపొదలతో నిండిపోయి నిరుపయోగంగా మారింది. పట్టణ నడిబొడ్డులో గల జడ్పీ బాలికల హైస్కూలుకు తగినంత క్రీడా ప్రాంగణం లేదు. ప్రైవేట్ విద్యాసంస్థల విషయం చెప్పనవసరం లేదు. గాలి వెలుతురు లేని ఇరుకు గదుల్లో తరగతులు నడవడమే కష్టంగా మారిన పరిస్థితుల్లో ఆటస్థలం మాటకు తావే లేదు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్టేడియం ఏర్పాటవుతున్నా అది ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులో రాకపోవడంతో వెంకటగిరి క్రీడాకారులు, ఔత్సాహికులకు ప్రోత్సాహం కరువవుతోంది.

కావలి దేశంలో వలసలు!

కావలి తెలుగుదేశం పార్టీలో వలసలు ప్రారంభమైన సూచనలు కన్పిస్తున్నాయి. చాలాకాలంగా తెలుగుదేశం పార్టీలో వున్న కావలి మాజీ మండలాధ్యక్షుడు నాయుడు రాంప్రసాద్ ఆ పార్టీని వీడే పరిస్థితి ఏర్పడింది. టిడిపిలో కొనసాగుతున్నప్పటికీ ఇటీవల ఆయన కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాలకు వస్తుండడం, చురుకుగా వ్యవహరిస్తుండడంతో రాంప్రసాద్ కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటనల్లో ఆయన హడావిడి అధికంగా వుండడం కన్పిస్తోంది. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి

కాంగ్రెస్ గూటికి నాయుడు రాంప్రసాద్


పితాని సత్యనారాయణ కావలి వచ్చిన సందర్భంలో మాజీ ఎమ్మెల్యే పార్వతమ్మ తమ నివాసానికి కాంగ్రెస్‌పార్టీకి చెందిన ప్రముఖులను మాత్రమే ఆహ్వానించారు. అక్కడకు నాయుడు రాంప్రసాద్ ప్రత్యక్షమవ్వడం, మంత్రి పితానికి ఎదురెళ్లి స్వాగతం పలకడంతో పార్టీ మారుతున్నారన్న వాదనకు బలం చేకూరుతుంది. ఉదయగిరి నియోజకవర్గంలో దేశం నేతల వలసలు పూర్తయిన తర్వాత కావలి నియోజక వర్గంలోని టిడిపి నేతలను కాంగ్రెస్‌పార్టీలోకి తీసుకవచ్చేందుకు, తమవైపు తిప్పుకొనేందుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పావులు కదుపుతున్నట్లు సమాచారం. కావలితోపాటు, అల్లూరు, మోపూరు, దగదర్తి, ఇస్కపల్లి ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ నుంచి అధికసంఖ్యలో కాంగ్రెస్ పంచన చేరనున్నారన్న ప్రచారం అధికంగా వుంది. దీనికితోడు బోగోలు మండలంలో బలమైన నేతగా వున్న టిడిపి మండలాధ్యక్షుడు పాశం రవికుమార్ బీద సోదరులపై తీవ్ర అసంతృప్తితో వున్నట్లు సమాచారం. కొన్నేళ్లుగా పార్టీలో వుంటూ బీద సోదరులకు ఎన్నికల్లో తమ ప్రాంతంలో మెజార్టీ తెప్పిస్తూ పట్టున్న రవికుమార్‌తో కొందరు నేతల మాటలు విని మస్తాన్‌రావు అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తుండడంపై అసంతృప్తిగా వున్న ఆయన పార్టీ వీడే అవకాశం వుందనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

సాగునీటికి ఇబ్బందులు

ఆత్మకూరు చెరువు క్రింద కాల్వలు పూడిపోయాయి


ఆత్మకూరు ప్రాంతంలో సాగునీటి కాలువల బాగోగులను అధికారులు పట్టించుకోకపోవడంతో నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆత్మకూరు చెరువు క్రింద నాలుగువేల ఎకరాలకు పైగా ఆయకట్టు వుంది. వర్షాభావం కారణంగా చెరువులో చుక్కనీరు లేదు. కానీ సోమశిల జలాశయం నుంచి నీటి విడుదల జరిగితే ఆత్మకూరు ట్యాంకు సప్లైచానల్ వరకు నీరు చేరుతుంది. అయితే ఆత్మకూరు బ్రాంచి చానల్, ఎటిఎస్ కాలువ లంతా పూడికమయమయ్యాయి. కాలువల్లో పూడిక తీయించాలన్న శ్రద్ధ ఇరిగేషన్ అధికారుల్లో కొరవడడంతో సోమశిల రిజర్వాయర్ నుంచి నీరు అందని పరిస్థితి ఎదురౌతోంది. ఉత్తర కాలువ నుంచి ఎబిచానల్‌లోకి ప్రవహించి, అక్కడ నుంచి బొగ్గేరులో కొంతదూరం వచ్చి తర్వాత ఎటిఎస్ చానల్‌లో ముందుకెళ్లాల్సి వుంటుంది. కాలువల్లో పూడిక కారణంగా నీటి సరఫరా సాఫీగా జరగక రైతులు పంటల సాగు చేసేందుకు అష్ట కష్టాలు పడాల్సి వస్తోంది.

జనం దృష్టి మళ్లింపుకే బాబుపై కేసు




తన ఆస్తులపై సిబిఐ జరుపుతున్న విచారణ పట్ల జనం దృష్టిని మళ్లించడానికి తెలుగుదేశం అధినేత చంద్రబాబుపై హైకోర్టులో పిటీషన్ వేయించాడు వై.ఎస్ జగన్. చంద్రబాబు అధికారంలో వుండగా కోట్లాదిరూపాయల అవినీతికి పాల్పడ్డాడంటూ తన తల్లి విజయమ్మ చేత పిటీషన్ వేయించాడు. చంద్రబాబు అవినీతిపై విచారణను జరిపించాలంటూ గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూడా హైకోర్టులో పిటీషన్ వేశాడు. అప్పట్లో పిటీషన్ తుది విచారణకు వచ్చే ముందే వై.ఎస్ తన పిటీషన్‌ను ఉపసంహరించుకున్నాడు. దానిపై అప్పట్లో పలు కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. తిరిగి అవే ఆరోపణలతో వై.ఎస్ సతీమణి విజయమ్మ ఇప్పుడు పిటీషన్ వేయడం రాజకీయ వర్గాల్లో వేడిపుట్టించింది. రాజకీయాల్లో ఆగర్భ శత్రువులు ఇలా ఒకరిపై మరొకరు పిటీషన్లు వేసుకుంటూ పోతే న్యాయవ్యవస్థ ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

అయిననూ పోయిరావలె రాజ్‌భవన్‌కు...!!




తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, పిసిసి చీఫ్ వారానికోసారి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో మంచీచెడ్డా మాట్లాడి వస్తున్నారు. ముఖ్యమంత్రి ఇలా తరచూ గవర్నర్‌ను కలవడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి. గవర్నర్‌తో ఎప్పుడూ టచ్‌లో వుండాలని అధిష్టానం ఆదేశించినట్లు రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎందుకైనా మంచిదని పిసిసి చీఫ్ బొత్సా కూడా గవర్నర్ కనుసన్నల్లో మెలుగుతున్నాడు. వారానికోసారి ముఖ్యమంత్రి, పిసిసి చీఫ్‌లు రాజ్‌భవన్‌కు వెళ్తుండటంతో గవర్నర్ కార్యాలయం రాజకీయ కేంద్రంగా మారిందట. రాష్ట్రంలో ముఖ్యంగా తెలంగాణలో జరుగుతున్న పరిస్థితుల్ని గమనిస్తూ గవర్నర్‌కు నివేదించడానికి ఓ ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారట. మొత్తానికి గవర్నర్ చుట్టూ తిరుగుతున్నాయి రాష్ట్రరాజకీయాలు.

తెలుగుదేశంకు గుడ్డిలో మెల్ల




తెలంగాణ ప్రాంతంలో తెలుగుదేశంపార్టీకి నూకలు చెల్లాయనుకుంటున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ డివిజన్ ఎన్నిక ఆ పార్టీలో నూతనోత్సాహాన్ని నింపింది. కూకట్‌పల్లిలోని ఓ కార్పొరేటర్ ఎన్నికల్లో తెలుగుదేశం, కాంగ్రెస్ పోటీపడ్డాయి. విచిత్ర మేమంటే టిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో తలపడలేక పక్కకు తప్పుకుంది. ఎన్నిక చిన్నదే అయినా ప్రచారం మాత్రం పోటీపోటీగా జరిగింది. చివరకు తెలుగుదేశం అభ్యర్థి గెలుపొందింది. అధికారపార్టీ అభ్యర్థి పరాజయం పాలయ్యారు. కూకట్‌పల్లిలో సీమాంధ్రులు ఎక్కువగా ఉండటంతో తెలుగుదేశం గెలుపొందిందంటూ కాంగ్రెస్ సన్నాయినొక్కులు నొక్కుతోంది. అయితే తెలంగాణ ప్రాంతంలో ఈ గెలుపు తమ పార్టీకి కిక్కుయిస్తుందని తెలుగు తమ్ముళ్లు తెగమురిసిపోతున్నారు. గుడ్డిలో మెల్ల అని ఊరికే అన్నారా!

బోగస్ కంపెనీల బాస్ జగన్



వైఎస్ జగన్ వ్యాపార సామ్రాజ్యంలో తీగలాగితే డొంక కదులుతోంది. తామరతంపరగా వున్న కంపెనీల్లో బోగస్ శాతమే ఎక్కువట. జగన్ ఆస్తులపై దర్యాప్తు చేస్తున్న సిబిఐ బృందం ఈమేరకు 19 బోగస్ కంపెనీలను గుర్తించిందట. ఇవి పేరుకే కంపెనీలు... కాగితాలమీద తప్ప నిజానికి ఎక్కడా కనిపించలేదట. ఈ బోగస్ కంపెనీల ద్వారా జగన్ వేలాది కోట్ల రూపాయలు లావాదేవీలు నిర్వహించాడట. జగన్ కంపెనీల మాయను చూసి సిబిఐ అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారట. చాపక్రింద నీరులాగా కొనసాగుతున్న దర్యాప్తులో ఇంకా ఎన్ని విచిత్రాలు బయట పడతాయో వేచి చూడాల్సిందే.





మద్రాసు మహానగరంలో తెలుగుభాషాభివృద్ధికి విశేష కృషి చేసినందుకుగాను నెల్లూరీయుడు డాక్టర్ సిఎంరెడ్డిని చెన్నైలో జరిగిన ఆలిండియా తెలుగు ఫెడరేషన్ 22వ వార్షికోత్సవ సభలో సన్మానిస్తున్న తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య.



కావలిలో స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న తమిళనాడు గవర్నర్ రోశయ్య. వేదికపై విజయ్‌బాబు, బీద మస్తాన్‌రావు, వాకాటి నారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట పార్వతమ్మ వున్నారు.



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు పెద్దాస్పత్రిలో రక్తదానం చేస్తున్న పోలీసులను ప్రోత్సహిస్తున్న ఎస్పీ రమణకుమార్, ఎఎస్పీ నాగేశ్వరరావు, టౌన్ ఓఎస్‌డి నరసింహకిషోర్, సిఐ వీరాంజనేయరెడ్డి, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ పద్మావతి.



చీకటి వెలుగుల రంగేళి... దీపావళి


ప్రతి సంవత్సరం ఆశ్వీయుజ మాసంలో వచ్చే ముఖ్యమైన పండుగ దీపావళి. ప్రజలందరూ సంతోషంగా జరుపుకొనే పండుగ ఇది. దీపపు కాంతులు, బాణాసంచా పేలుళ్లతో సంతోష సంబరాలను నింపే పండుగ దీపావళి. ఈ పర్వదినాన్ని జీవితానికి దగ్గరగా అన్వయిస్తారు. జీవితంలో చీకటి వెలుగులు వున్నట్లే దీపావళి పండుగ వెలుగుజిలుగుల పండుగ. అందుకే సినీకవులు చీకటి వెలుగుల రంగేళి జీవితమే ఒక దీపావళి అని వర్ణించారు. గీతాచార్యుడు చెప్పినట్లు కామక్రోధాలు నరకానికి కారణాలు. వీటిని జయించాలంటే అజ్ఞానాంధ కారాన్ని జయించి జ్ఞానదీపాన్ని వెలిగించాలి. నిండైన ప్రమిద ప్రచోదయమైతే ఆ ప్రమిదను వైరాగ్యమనే నూనెతో నింపి భక్తి అనే పత్తితో జ్ఞానమనే దీపాన్ని వెలిగించినప్పుడు భక్తి వైరాగ్యాలు అజ్ఞానంధకారాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించినట్లవుతుందనేది దీపావళి సందేశంగా చెప్తారు. అక్టోబర్ 26వ తేది దీపావళి పండుగ.

నరకచతుర్దశి, దీపావళి పండుగలకు సంబంధించి పురాణ కథనం ఒకటి వుంది. హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు భూమిని అనంత సముద్ర జలాల్లో పడవేస్తాడు. అప్పుడు విష్ణుమూర్తి వరాహ అవతారం ఎత్తి హిరణ్యాక్షుడిని సంహరించి భూమిని ఉద్ధరిస్తాడు. ఆ సమయంలో భూదేవికి, విష్ణుమూర్తికి కల్గిన సంతానమే నరకాసురుడు. నిషిద్ధకాలమైన సంధ్యా సమయంలో కలవడం వలన కల్గిన కుమారుడు కాబట్టి అతనికి అసుర లక్షణాలు వచ్చాయని విష్ణుమూర్తి భూదేవికి చెప్తాడు. ఆ మాటలకు బాధపడిన భూదేవి విష్ణుమూర్తి తన బిడ్డను సంహరించకుండా వుండేందుకు వరాన్ని కోరుతుంది. అందుకు సమ్మతించిన విష్ణుమూర్తి తల్లిచేతులలో మాత్రమే మరణించేలా వరాన్ని ప్రసాదిస్తాడు. జనకమహారాజు పర్యవేక్షణలో పెరిగి పెద్దవాడైన నరకాసురుడు కామాఖ్యను రాజధానిగా చేసుకొని ప్రాగ్జ్యోతిష్యపురం అనే రాజ్యాన్ని పరిపాలిస్తుంటాడు. కొన్ని యుగాలు గడిచిన తర్వాత ద్వాపర యుగంలో అతనికి ప్రక్క రాజ్యమైన శోణితపురానికి రాజైన బాణాసురినితో స్నేహం ఏర్పడుతుంది. అతని ప్రభావం చేత నరకాసురుడు మెల్లగా స్త్రీలను భోగవస్తువుగా చూడడంతో పాటు వివిధ రాజ్యాలలోని 16వేల మంది రాకుమార్తెలను ఎత్తుకొని వచ్చి బంధిస్తాడు. ఒకనాడు స్వర్గంపై దండయాత్ర చేసి దేవతల తల్లి అయిన అదితిని అవమానపరుస్తాడు. దేవతలందరు విష్ణుమూర్తి అవతారమైన శ్రీకృష్ణుని వద్దకు వెళ్లి సహాయం చేయమని వేడుకుంటారు. అప్పుడు భూదేవి సత్యభామ రూపంలో అవతరించి శ్రీకృష్ణుని వివాహమాడి వుంటుంది. దంపత్ సమేతంగా నరకాసురునిపై యుద్ధానికి వెళ్లగా ఇరువురి మధ్య భీకర సంగ్రామం జరుగుతుంది. అప్పుడు శ్రీకృష్ణుడు మూర్ఛపోయినట్లు నటించగా సత్యభామ ఆగ్రహంతో స్వయంగా విల్లు ఎక్కుపెట్టి నరకాసురుని సంహరిస్తుంది. నరకాసురుని వధ జరిగిన రోజును నరకచతుర్దశిగా, మరుసటి రోజైన అమావాస్య నాడు దీపావళి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

దీపావళి పండుగ నాడు సాయంత్రం దీపాలు వెలిగించి ఇళ్లను అలంకరించడంతోపాటు పలు ప్రాంతాల్లో నరకాసురుని బొమ్మలు తయారు చేసి కాల్చివేస్తారు.


ట్రంకు రోడ్డు

అనాథ పిల్లల సేవలో ఎస్పీ!



నెల్లూరు బోడిగాడితోటలో నివాసముంటూ చదువు సంధ్యలకు దూరమైన పిల్లల కోసం ఎస్పీ రమణకుమార్ చైల్డ్ అండ్ పోలీస్ ప్రాజె క్టును డిజిపి దినేష్‌రెడ్డి చేత ప్రారంభింప జేశారు. ఎందువల్లో ఈ ప్రాజెక్ట్ డిజిపిని కూడా ఆకర్షించింది. ఆయన స్వంత డబ్బులు లక్ష రూపాయలు విరాళమందించారు. ప్రాజెక్ట్ ప్రారంభమైన ఈ రెండు వారాల వ్యవధిలోనే ఎస్పీ వీలు దొరికినప్పుడల్లా ప్రాజెక్ట్‌ను సందర్శిస్తున్నారు. ఇక్కడి పిల్లలకు చిరు కానుకలు అందజేస్తున్నారు. ఆప్యాయంగా వారిని దగ్గరకు తీసుకొని మనసారా వారిని పలకరిస్తుండడంతో పిల్లలు కూడా ఎస్పీని అమితంగా అభిమానిస్తున్నారు. చదువు సంధ్యలవైపు అడుగులు వేస్తున్నారు. వాస్తవ రూపంలో ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే పోలీసు ప్రతిష్ట పెరగడం ఖాయం.

దైవబలం తోడుగా




శాస్త్ర సాంకేతిక ప్రగతిలో మానవుడు మహనీయుడు కావచ్చు. కానీ ప్రతి కార్యానికి దైవబలం తోడుండాలని చెబుతున్నది ఏ స్వామీజీనో కాదు... సాక్షాత్తూ ఇస్రో ఛైర్మన్ రాధాకృష్ణన్. 12వ తేది పిఎస్ఎల్‌వి సి-18 రాకెట్ ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించారాయన. దేవదేవుని కృపాకటాక్షాలతో ఉపగ్రహ ప్రయోగాలు విజయవంతమవుతున్నాయని, అందుకే శ్రీవారికి మొక్కు చెల్లించుకొని వస్తున్నానంటున్నారాయన. రాధాకృష్ణన్ వాఖ్యలను ట్రంకురోడ్డులో హేతువాదులు ఖండిస్తుంటే సనాతనవాదులు జయహో అంటున్నారు.

సినిమా ప్రియుడు




ప్రతి ఒక్కరూ కలలు కనండి... వాటిని నెరవేర్చుకోండని మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం తరచూ అంటుంటారు. అబ్దుల్‌కలాం గారు ఈ మాటలు చెప్పేందుకు ముందే స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి కలలుకన్నారు. వాటిని నెల్లూరులో అందమైన సినిమా హాళ్లు కట్టి నెరవేర్చుకొన్నారు. ఈ విషయం ఆయన సతీమణి పార్వతమ్మ ఎస్-2 మల్టీప్లెక్స్‌ల ప్రారంభోత్సవంలో చెప్పారు. ఆయనకు సినిమాలంటే వల్లమాలిన అభిమానం. చిన్నప్పుడు సినిమా పోస్టర్ కోసం చేతికున్న బంగారం ఉంగరాన్ని పోస్టర్ అతికించే వాడికి ఇచ్చేశారు. సుబ్బరామరెడ్డి కోసమే వాళ్ల నాన్న లీలామహల్ కట్టించారు. ఒకే ప్రాంగణంలో కృష్ణ, కావేరి, కళ్యాణి థియేటర్ల మాదిరి సముదాయం రాష్ట్రంలో ఎక్కడా లేదు. దాన్ని సుబ్బరామరెడ్డి దగ్గరుండి ఎంతో అందంగా కట్టించారు. వీటిని ఇంకా ఆధునీకరించడం చూసి వుంటే ఎంత సంతోషించే వారోనని ఆమె గద్గద స్వరంతో చెప్పడంతో ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారంతా ఆశ్చర్యపోయారు. సుబ్బరామరెడ్డి ఇంత సినీ అభిమానా అంటూ ట్రంకురోడ్డులో ఇంకా చర్చ కొనసాగిస్తూనే వున్నారు.

ఫస్ట్ డే నో సినిమా



నెల్లూరు వచ్చిన మెగాస్టార్ చిరంజీవి నిప్పులాంటి నిజమొకటి చెప్పారు. తాను తెలుగు సినిమా పరిశ్రమలో గొప్ప హీరోనైనా విడుదలైన సినిమాకు ఫస్ట్‌డే వెళ్లనన్నారు. దీనికి కారణం చిన్న తనంలో నెల్లూరు రంగమహల్‌లో తనకు ఎదురైన చేదు అనుభవమే కారణమన్నారు. ఎన్టీఆర్ హీరోగా నటించిన రాము సినిమా చూడను తాను, నాగబాబు నేల టిక్కెట్ కోసం క్యూలో నిలబడి నలిగిపోయామన్నారు. క్యూ నుంచి బయటకు రాగానే అక్కడే నిలబడి వుండిన తమ తండ్రి రఫాడించేశారని ఈ ఘటనను జీవితంలో మరచిపోలేనని అప్పటి నుంచి ఫస్ట్ డే సినిమాలకు వెళ్లడం మానుకొన్నానని, అదే పాలసీ నేటికీ పాటిస్తున్నానని ఎస్-2 మల్టీప్లెక్స్‌ల ప్రారంభోత్సవంలో చిరంజీవి ఈ మాట చెప్పడంపై ట్రంకు రోడ్డులో విస్తృత చర్చ జరుగుతుంది. చిరంజీవి కూడా నేలలో కూర్చొని సినిమాలు చూసిన వ్యక్తేనని పది మంది చెప్పుకోవడం ఆయన అభిమానులకు ఏ మాత్రం రుచించడం లేదు.

సమీక్షల్లో కలెక్టర్



జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకొన్న కొత్తలో శ్రీధర్‌రెడ్డి జిల్లావ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. సామాన్యుల కష్టాలను అడిగి తెలుసుకొన్నారు. కలెక్టర్ కార్యాలయం, బంగళాలో జనానికి అందుబాటులోనే వుండినారు. కానీ ఈ మధ్య ఆయన వివిధ ప్రభుత్వ శాఖల సమీక్షల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీగా వుండడం చర్చనీయాంశమయ్యింది. సమీక్షల మూలంగా కలెక్టర్‌గారు ఎవరికీ అందుబాటులో లేకుండా పోయారు. మండల, జిల్లా స్థాయి అధికారులు సమీక్షా సమావేశాలకు నెల్లూరు తరలి రావడంతో మండల కేంద్రాలలో అధికారులు అందుబాటులో వుండడం లేదు. సమీక్షలపై కలెక్టర్‌గారు ఒకసారి సమీక్ష చేస్తే బాగుంటుందని కలెక్టరేట్‌లో ఒకటే సణుగుడు. మరి ఆయన ఏ విధంగా స్పందిస్తారో?



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండడం మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా వుంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. ఆర్థికలావాదేవీలలో జాగ్రత్త. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా వుండాలి. పైవారిని విమర్శించకుండాలి.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

నరాలకు సంబంధించిన బాధలధికం. సంతానమూలంగా మానసిక వేదనకు గురౌతారు. ముందుచూపుతో అడుగేయాలి. ప్రతి విషయంలో ఎదుటివారు తప్పుగా అంచనా వేస్తారు. కోరినా సలహా లివ్వవద్దు. గుట్టుగా కాలం గడపడం మంచిది. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. ప్రయాణాలు కోరినరీతిలో జరుగవు. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

ఇంతవరకు వుంటూవచ్చిన ఇబ్బందులు తొలగుతాయి. చిరకాలంగా ఎదురు చూస్తూవచ్చిన శుభఫలితాలు అనుభూతిలోకి వస్తాయి. శత్రువులు లొంగి నడచుకొంటారు. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు. కుజుని, ఆంజనేయుని కొలవాలి. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం. వృత్తిపరులకు, కళాకారులకు మంచి ఆదరణ. విద్యార్థులకు చదువు విషయంలో కొంత మేలు.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

ప్రయాణాలలో సత్ఫలితాలు ఎదురుచూడవచ్చు. చిన్న చిన్న సమస్యలు ఎదురవవచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. విదేశీ ప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులు సాయమందిస్తారు. కుటుంబంలో సమస్యలు తీరుతాయి. రాజకీయులకు మేలైన కాలం. కళాకారుల ప్రతిష్ఠ పెరుగుతుంది.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ధనవిషయంలో కటకట ఉండవచ్చు. సోదరుల సాయమందుతుంది. పనులు నిదానంగా సాగవచ్చు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులకు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈ వారంలో పూడ్చుకో వీలవుతుంది. అప్పులు తీరుస్తారు. విద్యార్థులకు ఒకవిధంగా చదువు సాగుతుంది. ఇంటిలో వివాహసంబంధ విషయాలు ప్రస్తావనకు వస్తాయి.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

అధిక ఖర్చులు మనసును కుంగతీస్తాయి. బంధువుల రాక తృప్తినిస్తుంది. దైవ కార్యాలలో ఎక్కువగా పాలు పంచుకోవాలి. వ్యాపారులకు లాభాలలో కొంత కోత ఏర్పడవచ్చు. నిదానంగా ఖాతాదారుల మనసెరిగి నడచుకోవడం మంచిది. భాగస్వాములతో గొడవలు రాకుండా చూసుకోవాలి. రాజకీయులు లేనిపోని గొడవల్లో చిక్కుకొంటారు. ఉద్యోగులకు శ్రమ అధికం. సరైన ప్రోత్సాహం వుండదు.

వారఫలాలు

తేది 22-10-2011 నుండి 28-10-2011 వరకు తులలో రవి, బుధ, శుక్రులు; మేషంలో గురువు; కర్కాటకంలో కుజుడు; కన్యలో శని; వృషభంలో కేతువు; వృశ్చికంలో రాహువు; సింహ, కన్య, తుల, వృశ్చికాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

24తేది ధన్వంతరి జయంతి.
25తేది నరకచతుర్దశి.
26తేది దీపావళి అమావాస్య.

శుభ ముహూర్తాలు

28తేదీ సింహ లగ్నాన
తె.03.00 నుండి 05.00 గంటల వరకు
శుభముహూర్తాలున్నాయి.

అక్టోబర్ తిథులు


ఆశ్వయుజ బహుళ

22	శని	దశమి	ప 12.57	గం.ల.వ
23	ఆది	ఏకాదశి	ఉ 11.20	గం.ల.వ
24	సోమ	ద్వాదశి	ఉ 09.27	గం.ల.వ
25	మంగళ	త్రయోదశి	ఉ 07.14	గం.ల.వ
		చతుర్దశి	తె 04.52	గం.ల.వ
26	బుధ	అమావాస్య	రా 02.22	గం.ల.వ

కార్తీక శుద్ధ

27	గురు	పాడ్యమి	రా 11.57	గం.ల.వ
28	శుక్ర	విదియ	రా 09.44	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

సాధారణంగా గడచిపోతుంది. ఆర్థికవిషయాలు చక్కగా వున్నాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. తండ్రి తండ్రివంటివారికి ఇబ్బందులుండవచ్చు. శ్వేతప్రదరం బాధించవచ్చు. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. ఖర్చుకు వెరవరు. ప్రతి పనిలో దూకుడధికం. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. అన్ని రంగాలలో ముందంజ వేస్తారు. వ్యాపారులకు అత్యంతం చక్కని కాలం.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

ఊహించనిరీతిలో ధనవ్యయమవుతుంది. ఎంత పొదుపు చేయాలనుకున్నా వీలుకాదు. ఇష్టులైనవారికి గాను ఖర్చు అవవచ్చు. బంధుమిత్రుల సహాయసహకారాలందుతాయి. గృహనిర్మాణం లేదా వసతి గృహాన్ని అమ్మడం అనే పనులలో నిమగ్నమవుతారు. శనిని ఆంజనేయుని తప్పక కొలవాలి. ఆర్థిక సమస్యలుంటాయి. రాజకీయులు జాగ్రత్తగా నడచుకోవాలి. విద్యార్థులకు వృథా కాలక్షేపం.




ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ప్రయాణాలలో సత్ఫలితాలు ఎదురుచూడవచ్చు. చిన్న చిన్న సమస్యలు ఎదురవవచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. నోటికి సంబంధించిన అనారోగ్య బాధలుంటాయి. విదేశీప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులు సాయమందిస్తారు. కుటుంబంలో సమస్యలు తీరుతాయి. రాజకీయులకు మేలైన కాలం.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

సంతానమూలంగా మానసిక వేదనకు గురౌతారు. ముందుచూపుతో అడుగేయాలి. ప్రతివిషయంలో ఎదుటివారు తప్పుగా అంచనా వేస్తారు. కోరినా సలహాలివ్వవద్దు. గుట్టుగా కాలం గడపడం మంచిది. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. ప్రయాణాలు కోరినరీతిలో జరుగవు. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు తీరని వేదన చోటుచేసుకొంటుంది.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

చాలా ప్రోత్సాహకరమైన కాలం. వృత్తిరీత్యా ఉత్సాహం అధికమవుతుంది. ప్రయాణాలలో జాగ్రత్త. అనుకొన్న పనులు అనుకొన్నరీతిలో సాగుతాయి. సంతానమూలంగా సుఖశాంతులు లభిస్తాయి. వారి విద్యారంగం ప్రోత్సాహకరంగా వుంటుంది. ధన విషయంలో లోటుండదు. భవిష్యత్తుకు మంచి పథకాలు వేస్తారు. పురోభివృద్ధి అన్ని రంగాలలో వుంటుంది. రాజకీయులకు అత్యంత అనుకూలమైన కాలం.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

జీవితభాగస్వామి బంధువులతో గొడవలుండవచ్చు. నోరు పారవేసుకోకుండడం మంచిది. ప్రతి పని నిలిచి నిదానంగా చేయడం మంచిది. వృత్తిలో మార్పు చేర్పులుండవచ్చు. వ్యాపారులకు కొంత వరకు మేలు. భాగస్వాములతో జాగ్రత్త. దైనందిన కార్యక్రమాలలో ఆటంకాలుండవచ్చు. విద్యార్థులకు ఒకమోస్తరుగా చదువు సాగుతుంది. ఉద్యోగులకు శ్రమ తగ్గుముఖం పడుతుంది.

ఆగ్నేయం పెరగడం అరిష్టం!

అరిపినేని రమణమ్మ *దాచూరు*

** నిర్మాణంలో ఇల్లు 'ఆగ్నేయం' పెరిగింది. ఆడపిల్లలకు సమస్యలున్నాయి. ఏ యంత్ర ప్రతిష్ఠ చేయాలి?*

స్థలరీత్యాగానీ, నిర్మాణంలోగానీ ఆగ్నేయం పెరగడం అరిష్టం. దాన్ని సరిదిద్దుకోండి. యంత్ర ప్రతిష్ఠ అంశం భార్యాభర్తల నామాక్షరాలను బట్టి నిర్ణయించబడుతుంది.

డి.సుధాకరరెడ్డి *నెల్లూరు*

** 'అశ్విని' నక్షత్రం దాని శక్తిస్థానాన్ని, దిక్కును, తత్వాన్ని చెప్పండి?*

అశ్విని నక్షత్రానిది బ్రాహ్మణశక్తి. దిక్కు తూర్పు(ఇంద్రస్థానం), పృధ్వీతత్వం. గణం – దేవగణం. జంతువు గుర్రం.

ఎం.లక్ష్మీకావేరి *సూళ్లూరుపేట*

** 'తులసి'కోట ఎందువల్ల ప్రశస్తం?*

లక్ష్మీ సమానురాలు ధనాన్నిస్తుంది, బహు మంజరి ఆయుష్షునిస్తుంది, శూలఘ్ని పాపహరం చేస్తుంది, సురసా గనుక ఆరోగ్యదాయిని, సురభిగళ గనుక కాలుష్యాన్ని హరిస్తుంది. ఇన్ని కారణాలున్నాయి మరి!

ఎ.శశిధర్‌రెడ్డి *హైదరాబాద్*

** 'గుణమేళన' సంఖ్యాబలం లేకుండా వివాహం రద్దు చేసుకోవాలా?*

గుణమేళన సంఖ్య పద్దెనిమిది దాటక పోయినా సప్తమ, చతుర్థ భావాలు జాతకంలో బాగుంటే వివాహం చేయవచ్చు.

సి.వి.కుమారి *సర్వేపల్లి*

** బృహస్పతి ఉచ్ఛస్థితి. ఏ రత్నం ధరించాలి?*

కనక పుష్యరాగం కుడి చిటికెన వ్రేలికి, బుధ స్థానం శత్రుస్థానం గనుక పచ్చ ఉంగరం వ్రేలికి ధరించండి. గణించికానీ ఏ యంత్రం వస్తుందో చెప్పలేం.

పి.లక్ష్మీకాంతమ్మ *నెల్లూరు*

** అబ్బాయిది చిత్త నక్షత్రం, అమ్మాయిది ఉత్తరాభాద్ర నక్షత్రం. అమ్మాయిది దుష్ట నక్షత్రమని ఆచార్యుల వారు చెప్పారు.*

ఆచార్యులు అలా చెప్పరు. మీరే నిర్ణయించేసుంటారు. ఉత్తరాభాద్ర మనుష్యగణం, గోవు. అయితే చిత్త రాక్షస గణం, పులి. దుష్టనక్షత్రం మీ సుపుత్రుడిదే. ఆరోపణలు అవమానాలకు గురి చేస్తాయి జాగ్రత్త!

పి.వెంకటేశ్వర్లు *నెల్లూరు*

** ఇల్లు కట్టడం అయిపోయింది. అక్కడక్కడా నిర్మాణాలు తీసివేసి యంత్రం ప్రతిష్ఠించమన్నారు. అయినా మార్పులేదు.*

ఇల్లు కట్టేటప్పుడే వాస్తుకు విలువివ్వాలి. దోషాల్ని సరిచేసుకోకపోతే యంత్రం నలభైశాతం మాత్రమే పనిచేస్తుంది. అదీ 'మండలం' పూజ పూర్తి చేస్తేనే!

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

బి.వెంకురెడ్డి *నెల్లూరు*

** అపార్టుమెంటు సెంటిమెంటు వల్ల అడ్వాన్సు ఇచ్చి కూడా వదులుకుంటున్నారు.*

'కాకినాడ' ఎఫెక్ట్ కావచ్చు. ఉత్తర స్మశానం సెంటిమెంటు కావచ్చు. ఏమైనా 'లాడా' కోసం గుర్రాన్ని కొనలేం కదా!

పి.శంకరనారాయణ *నెల్లూరు*

** చెట్లకు, మనిషి మనుగడకు లింకు పెడుతుందేమిటి 'వాస్తు భూషణం'?*

భూదేవి బ్రహ్మనడిగింది మనిషి, జీవరాశుల ఉనికి ఎంతవరకు అని? బ్రహ్మ ఉవాచ 'వృక్షాలు' నిశ్శేషమైన మరుక్షణం మనిషితోబాటు జీవరాశి అంతరిస్తుంది అని. అంచేత 'వృక్షోరక్షతి రక్షితః' అని మనం నిత్యం మననం చేసుకోవాలి.

సయ్యద్ రహ్మత్‌బేగం *నెల్లూరు*

** ఆయన ఆరోగ్యం బాగుండటం లేదు. పిల్లవాడి చదువూ అంతంతమాత్రంగానే వుంది.*

తూర్పు ఇళ్లతో వచ్చిన గొడవింతే. తూర్పు ఆగ్నేయం వీధి యజమానిపై, మగపిల్లవాడిపై ప్రభావాన్ని చూపుతుంది. సంబంధిత 'అవాస్తు'ను, జాతకాన్ని గణించి 'యంత్ర' ప్రతిష్ఠ చేసుకోండి.

జాన్ డేవిడ్ *నెల్లూరు*

** ఏయే నక్షత్రాలు శంకుస్థాపనకు నిషిద్ధం?*

సూర్యుడు, కృత్తిక, భరణి, రోహిణిలలో, చంద్రుడు రేవతి నక్షత్రమందున్నప్పుడు శుభకార్యం నిషిద్ధం.

పంచాయితీలను కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు!

సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసాక గ్రామ పంచాయితీల బాగోగులు పరిశీలించను నియమించిన ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ఇంత వరకు కాలు పెట్టలేదు. పెచ్చుపెరుగుతున్న సమస్యలను పరిష్కరించే వారు లేక జనం అల్లాడిపోతున్నారు.



బుచ్చిరెడ్డిపాళెంలో మురికితో నిండి ముదనష్టంగా వున్న సైడు కాల్వ.

గ్రామ పంచాయితీలకు నియమించిన ప్రత్యేకాధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. గ్రామ పంచాయితీల పాలకవర్గం గడువు ముగిసిన అనంతరం ఆగష్టు 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో కాలు కూడా పెట్టక పోవడం వల్ల గ్రామ పంచాయితీ పరిధిలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా స్తంభించి పోయాయి. పంచాయితీల గురించి పట్టించుకునే వారు లేకపోడంతో స్థానిక ప్రజలు వివిధ సమస్యలు ఎదుర్కోక తప్పడం లేదు. గతంలో వున్న గ్రామపంచాయితీ పాలకవర్గం కనీసం ఏదోఒక పని చేసేది. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, ఎంతో కొంతమేర జరిగేది. పాలకవర్గం గడువు ముగియడం, ప్రత్యేకాధికారులు పాలనలోకి రావడంతో ప్రజలు కష్టాలు పడుతున్నారు.

గ్రామ పంచాయితీలకు ప్రత్యేకాధికారులుగా నియమించబడ్డ మండలస్థాయి అధికారులు వారి కార్యాలయాల పనులు చక్కబెట్టుకొనడంలో నిత్యం బిజీగా వుంటున్నారు. అవసరమైన ఫైళ్లను పంచాయితీ కార్యదర్శులు వారి కార్యాలయాలకు తీసుకెళ్లి సంతకాలు చేయించుకుంటున్నారు. కేవలం ప్రత్యేకాధికారులు సంతకాలు చేసేందుకే పరిమితమైనట్లు కనిపిస్తుంది. గ్రామ పంచాయితీల పరిధిలో వున్న సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి పూర్తిగా మరచిపోతున్నారు. ప్రజల నుంచి వసూలు కావాల్సిన పన్నులు, పాత బకాయిలు పెండింగ్‌లో పడిపోతున్నాయి. పన్నులు వసూలు కాకపోతే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం వుండదు.

ఇంతకు ముందు గ్రామాల్లో ఏదైనా సమస్య తలెత్తితే స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొనే వారు ప్రజలు. ప్రస్తుతం పంచాయితీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లాలి. అయితే పంచాయితీ కార్యాలయంలో వుండాల్సిన కార్యదర్శులు అధికారుల వద్దకు వెళుతున్నామని చెప్పి సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. మరికొన్ని గ్రామ పంచాయితీల కార్యదర్శులు రోజుల తరబడి కార్యాలయాలకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. కార్యాలయాల వ్యవహారాలను బిల్లు కలెక్టర్లకు అప్పగించి బయటకు వెళుతుంటారు. తాగునీటి సరఫరా రెండు, మూడు రోజులకోసారి చేస్తున్నా అడిగేందుకు ఒక్కరూ అందుబాటులో వుండకుండా పోతున్నారు. పారిశుద్ధ్యం మరింత అధ్వాన్నంగా తయారైంది.

ఒక ప్రక్క రాష్ట్రప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుకోసం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని ఆదేశిస్తున్నా ప్రత్యేకాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలం చెందుతున్నారు. గ్రామ పంచాయితీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతారని ఆశించిన ప్రజలకు చివరకు నిరాశే మిగిలింది. మండలస్థాయిలో పనిచేసే ఎంపిడిఓ, తహశీల్దార్, వ్యవసాయాధికారి, పశువైద్యాధికారి, పంచాయితీరాజ్ ఏఇ తదితర శాఖల అధికారులను పంచాయితీల ప్రత్యేకాధికారులుగా ప్రభుత్వం నియమించడం జరిగింది. వీరి నియామకం జరిగి దాదాపు రెండు నెలలు కావస్తుంది.

ప్రత్యేకాధికారుల పని విధానం గురించి జిల్లా కలెక్టర్‌గానీ, పంచాయితీ అధికారిగానీ ఇప్పటివరకు సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయలేదు. ఎంపిడిఓలు, తహశీల్దార్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమావేశానికి హాజరైన అధికారులు గ్రామ పంచాయితీలలో వున్న పరిస్థితులు, సమస్యల గురించి కలెక్టర్‌కు స్పష్టంగా వివరించ లేకపోతున్నారని విమర్శలు వున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేకాధికారులను నియమించిన జిల్లా కలెక్టర్ వీరి పని విధానంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్వీకారానికి చేయూత

స్వీకారం పథకానికి చక్కని స్పందన!

జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు స్వీకారం పేరుతో జిల్లా కలెక్టర్ కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. దాతలు అందజేస్తున్న విరాళాలతో అన్ని వసతులు కల్పించాలన్న సంకల్పంతో అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ, వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పక్కా భవనాలకు మరమ్మత్తులు చేయనున్నారు. అలాగే హాస్టళ్లలో వుంటున్న బాలబాలికలకు అవసరమైన దుస్తులు, ప్లేట్లు, గ్లాసులు, బ్యాగ్‌లు ఇతర సామగ్రిని కూడా దాతలు అందించేందుకు ముందుకు వస్తున్నారు.

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, పేద విద్యార్థులకు కార్పొరేషన్ విద్యాసంస్థల్లో విద్య నందించేందుకు స్వీకారం, సరస్వతి నిధులను ఏర్పాటు చేయడం జరిగింది. కలెక్టర్ చేపట్టిన ఈ పథకాలకు అనేకమంది దాతలు విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. ఈ రెండు పథకాలకు దాతలు అందించే విరాళాలను సద్వినియోగం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. జిల్లాలోని అనేక సంక్షేమ హాస్టళ్లలో కనీస సదుపాయాలు లేక బాలబాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ఆయా శాఖలు నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి.

ప్రభుత్వం నిర్మించిన భవనాలు మరమ్మత్తులకు గురికావడం, తాగునీటి సరఫరా, డ్రైనేజి వ్యవస్థ లేకపోవడం తీవ్రంగా బాధిస్తుంది. జిల్లాలో ఏర్పాటు చేసిన కొన్ని పరిశ్రమల ప్రతినిధులు భవనాల మరమ్మత్తులు సొంతంగా చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ప్రధానంగా

ప్రభుత్వ హాస్టళ్లలో మౌలికసదుపాయాల కల్పనకు దాతల సహకారం కోరుతూ జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి ప్రారంభించిన స్వీకారం పథకానికి చక్కని స్పందన లభిస్తోంది. దీని మూలంగా ప్రభుత్వ హాస్టళ్లలో ప్రాథమిక సౌకర్యాలు ఒనగూడనున్నాయి.

బాలికల వసతి గృహాల్లో నీటిసరఫరా లేకపోవడంతో మరుగుదొడ్లు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో బాలికలు పడే ఇబ్బంది వర్ణనాతీతం. ప్రభుత్వం నుంచి దుప్పట్లు ఆశించిన మేర సరఫరా కావడం లేదు. చలికాలంలో చలికి తట్టుకోలేకపోతున్నారు. ఈ విషయం సంబంధిత హాస్టల్ వార్డెన్లకు తెలిసినా కూడా ఏం చేయలేని పరిస్థితిలో వుండిపోతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం మంజూరు చేసే అరకొర నిధులతో విద్యార్థులకు భోజనం పెడుతున్నారు.

ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు, బయట మార్కెట్ల నిత్యావసర వస్తువుల ధరలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో హాస్టళ్లను నిర్వహించడం కష్టతరంగా మారిందని పలువురు వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయం. సంక్షేమశాఖ అధికారులతో నిధులు అందజేస్తే దుర్వినియోగం జరిగే అవకాశం వుందన్న ప్రచారం వుండడంతో దాతలే నేరుగా పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. హాస్టళ్లకు సంబంధించి స్వీకారం పథకానికి అందిన నిధులను వినియోగించేందుకు జిల్లా కలెక్టర్ ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. నిజాయితీగల అధికారులను ఎంపిక చేసి ప్రతి పైసాను విద్యార్థుల అవసరాలకు ఖర్చు చేయాలన్నది కలెక్టర్ లక్ష్యం.

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా అన్ని హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. మరికొందరు దాతలు ముందుకు వచ్చి పక్కా భవనాల నిర్మాణానికి 50శాతం నిధులు సమకూర్చితే ఆ భవనానికి వారి పేరును పెట్టేందుకు అంగీకరిస్తున్నారు. మొత్తం మీద స్వీకారం పథకం ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతులు సమకూర్చేందుకు కలెక్టర్ చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.



చతికిలబడ్డ తెలుగమ్మాయి!

అల్లూరు రహీం

క్షమంగా వెళ్లి లాభంగా రండి, ఆదివారం ఆడవాళ్లకు సెలవు కావాలి వంటి సందేశాత్మక కుటుంబ కథా చిత్రాలు తీసిన దర్శకుడు రాజా వన్నెంరెడ్డి. ఆయనతో కృష్ణవేణి, దేవుళ్లు వంటి చిత్రాలు తీసిన నిర్మాత, రాజకీయ నాయకుడు కూడా అయిన చేగొండి హరిరామజోగయ్య తీసిన చిత్రమే తెలుగమ్మాయి. పేరు తప్ప ఈ చిత్రంలో పస లేదు. ఏదో తీయాలని ఏదేదో తీసేశాడు దర్శకుడు. రాష్ట్రంలో చాలా రోజుల క్రితం జరిగిన శ్రీలక్ష్మి, స్వప్నిక, ఆయేషా మీరాపై దాడులు దర్శకునికి ఈ చిత్రకథ తయారు చేసుకోను పురిగొల్పినట్లున్నాయి. కాని ఈ కథ విస్తరణకు దర్శకునికి దమ్ము చాలలేదు. ఈ సినిమాను చూడను సినిమా హాల్ వరకు ప్రేక్షకులు వెళ్లను పెద్ద నటీనటులు లేకుండాపోయారు. టైటిల్ రోల్ పోషించిన సలోనిని తెలుగమ్మాయిగా ఆకర్షణీయంగా చూపలేకపోయాడు. ప్రథమార్ధమంతా ట్రైన్‌లో నడిచే ఈ చిత్రం ముందుకు నడపడమే కనాకష్టమైపోయింది. ద్వితీయార్ధంలో హీరోయిన్ తెలుగమ్మాయిలా మారడానికి కారణమైన కథ చూపించిన తీరు సినిమాలా కాకుండా డ్రామాలా తోస్తుంది. దర్శకుడు కథను నడపను కొన్ని కామెడీ బిట్లను నమ్ముకొన్నాడు. కాని అవి పేలలేదు. పాటల్లో పసలేదు. వందేమాతరం శ్రీనివాస్ సంగీతం సమకూర్చడం తోపాటు పాడిన 'ఎన్ని నాళ్లురా' పాట వినడానికి బాగుంది. కాని దీని చిత్రీకరణ ఆకర్షణీయంగా లేదు. కత్తి లాంటి కుర్రోడు చరణంతో సాగే ఐటమ్ పాటలో షఫీ విలనీ షేడ్స్ పేలవంగా వున్నాయి. వర్షం, ఖలేజా చిత్రాల్లో షఫీ నటన బాగుంటుంది. ఈ సినిమాలో ఆయన మెయిన్ విలన్ అయినా పాత్ర బఫూన్ షేడ్స్‌తో నిండి వుంటుంది. బాగా మాటలు వ్రాసే నెల్లూరీయుడు రాజేంద్రకుమార్ ఈ చిత్రంలో అంత బాగా వ్రాయ లేకపోయాడు. 'లా'లో లక్ష లూప్‌హోల్స్ వున్నాయన్నదే ఆయన ఈ సందేశాత్మక చిత్రంలో వ్రాసిన గొప్ప డైలాగ్‌గా చెప్పుకోవాలి. అర్ధరాత్రి మహిళలు ఒంటరిగా తిరిగే రోజు రావాలని జాతిపిత గాంధీజీ ఆకాంక్షించిన విషయాన్ని దర్శకుడు తెలుగమ్మాయిలో ప్రతిభావంతంగా చూపడంలో చతికిల పడ్డాడని తేల్చి చెప్పేయవచ్చు.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుంది. ఈ రైలులో బాలా త్రిపురసుందరి(సలోని) ఎక్కుతుంది. ఆమె ఎక్కిన బోగీలోనే శివ (యశ్వంత్), శంకర్(విక్రమ్), మున్నా(సాయిచరణ్), శ్రీహర్ష(శ్రీహర్ష) సహ ప్రయాణీకులుగా ఎక్కుతారు. యువకులు నలుగురు తాము హీరో రవితేజను చూడను సామర్లకోట నుంచి వచ్చామంటారు. బాలా త్రిపురసుందరి తాను అనకాపల్లి వాసినంటుంది. కలివిడిగా యువకులతో మాట్లాడడంతో వాళ్లు ఆమెతో తమను వూహించుకొని డ్యూయెట్లు పాడుకొంటారు. ఇంతలో విజయవాడ స్టేషన్‌లో కాళిదాసు(షఫీ) అదే బోగీలో ఎక్కుతాడు. ఎక్కింది మొదలు కసి చూపులతో బాలాత్రిపుర సుందరిని కరకర నమిలేస్తాడు. మందు తాగడం మొదలు పెడతాడు. అడ్డుకోను పోయిన నలుగురు యువకులను తంతాడు. బాలాత్రిపుర సుందరి పైన పడడాన్ని సహించలేని యువకులు అతన్ని కత్తితో పొడిచి రైలు నుంచి శవాన్ని బయటవేస్తారు. అతని జేబులో టిక్కెట్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసు అధికారి (సాయికుమార్) సామర్లకోటలో దిగిన యువకులను అరెస్ట్ చేస్తాడు. వాళ్లను ఇంటరాగేట్ చేయగా తామే కాళిదాసును చంపేశామంటారు. ఇంతలో స్టేషన్‌కు ఫోన్ వస్తుంది. అనకాపల్లిలోని మదర్ థెరిస్సా ఆశ్రమానికి సాయికుమార్, నలుగురు యువకులతో కలసి వెళ్లగా అక్కడ బాలాత్రిపుర సుందరి కనపడుతుంది. తన పేరు భారతి అని తన ప్రాణ స్నేహితురాలు సంఘ సేవిక సంధ్యను దారుణంగా చంపిన సైకో కాళిదాసును పోలీసులు ఏం చేయకుండా వదలి వేయడంతో తాను రంగంలో దిగి చంపినట్లు చెబుతుంది. సాయికుమార్‌కు కాళిదాసు దురాగతాలు బాగా తెలిసి వుండడం, అతనికి హోం మినిస్టర్ కూడా సహకరించడం భరించలేక ఒక మంచి పని చేశావంటూ బాలా త్రిపుర సుందరి, ఆమె మిత్ర బృందాన్ని అభినందించి అరెస్ట్ చేయకుండా వదలివేయడంతో చిత్రం ముగుస్తుంది.

తెలుగమ్మాయి పాత్రను పోషించడంలో సలోని పూర్తిగా విఫలమయ్యింది. ఈ చిత్రంలో మిగతా పాత్రల గూర్చి చెప్పుకోవాలంటే ఒక్క సాయికుమార్ పాత్రనే. ఆయన పాత్ర పది నిమిషాలే అయినా దాన్ని బాగా పోషించాడు. డబ్బులు పెట్టి పోయి తలనొప్పి తెచ్చుకొనే జాబితాలోని చిత్ర రాజమే తెలుగమ్మాయి.

వాళ్లు స్నేహితులే...



నను నటించిన ప్రతి కథానాయకుడితోనూ సన్నిహితంగానే వుంటా. అంత మాత్రాన వారితో నాకు ప్రేమ వుందని అనేస్తే ఎలా అంటుంది హీరోయిన్ బిపాసబసు. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమె పిచ్చాపాటీగా మాట్లాడుతూ జాన్‌అబ్రహాంతో చాన్నాళ్లు కలిసుండి ఇప్పుడు విడిపోయేసరికి లేనిపోని పుకార్లు సృష్టిస్తున్నారు. రణబీర్‌కపూర్, నీల్ నితిన్ ముఖేష్, రానా వీరందరితో నాకు ప్రేమ సంబంధాలు అంటగడుతున్నారు. రానాతో పెళ్లి దాకా వెళ్లనని ఇటీవల గబ్బు రేపారు. వీటిలో ఎంత మాత్రం నిజం లేదు. నా హీరోలందరూ నాకు మంచి స్నేహితులు. ప్రేమించడం అనే భావన చాలా కొత్తగా వుంటుంది. కానీ ప్రస్తుతానికి నేను ఎవర్నీ ప్రేమించడం లేదు. భవిష్యత్తులో కూడా ఎవరి మీదైనా ప్రేమ పుడుతుందో లేదో ఇప్పుడే చెప్పలేను. దేన్నైనా కాలమే నిర్ణయిస్తుంది. నేను తలరాతను నమ్ముతా. సినిమాల విషయానికొస్తే షారూఖ్‌ఖాన్ సరసన కనిపించాలని ఆశగా వుందంది.

మహేష్ సరసన మళ్లీ సమంత



దూకుడు చిత్రంతో ప్రేక్షకులను అలరించిన జంట మహేష్ బాబు – సమంతలు మరోసారి కలసి వెండితెరపై కనువిందు చేయబోతున్నారు. వెంకటేష్ – మహేష్‌బాబుల కలయికలో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు అనే చిత్రం రూపుదిద్దుకొంటుంది. శ్రీకాంత్ అడ్డాల ఈ చిత్ర దర్శకుడు. నిర్మాత దిల్‌రాజు ఈ చిత్రంలో మహేష్‌బాబు సరసన సమంతను కథానాయికగా ఎంచుకొన్నట్లు సమాచారం. వెంకటేష్ సరసన ప్రియమణిని ఎంపిక చేశారు. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్తుంది.

మంచి పేరు చాలు



ఎదం, మిరపకాయ్, వాంటెడ్ చిత్రాలలో తెలుగు తెరకు పరిచయమైన పంజాబీ భామ దీక్షాసేథ్ చేతిలో ప్రస్తుతం రెండు చిత్రాలున్నాయి. నిప్పు సినిమా షూటింగ్ గ్యాప్‌లో ఆమె మాట్లాడుతూ ఒకే ఒక చిత్ర విజయంతో రాకెట్ వేగంతో దూసుకెళ్లిపోవాలనే ఆశలేదు. దేనికైనా కొంచెం సమయం పడుతుంది. నేను నటించిన వాటిలో వేదం మంచి సినిమా. వాంటెడ్ కమర్షియల్ సినిమా. నాకు అవకాశాలు జోరుగా లేవు అనడం కూడా సరికాదు. ఈ పరిశ్రమలో ఎవరు ఎంత కాలం కొనసాగుతామో చెప్పలేం. దొరికిన అవకాశాలను సద్వినియోగపర్చుకొంటూ కాస్త మంచి పేరు తెచ్చుకొంటే అదే చాలంటుంది దీక్షాసేథ్.

మడికట్టుకొని కూర్చోలేను!



తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ హిందీ పరిశ్రమల్లో నాయికగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొంది జెనీలియా. ఇటీవల ఈమె నటించిన హిందీ చిత్రం ఫోర్స్‌లో జాన్ అబ్రహాంతో బోల్డ్‌గా నటించింది. ఈ విషయమై ప్రస్తావిస్తే సమాధానంగా తెర మీద ఫలానా విధంగానే కనిపించాలని గిరిగీసుకోలేదు. ప్రేక్షకులు ప్రత్యేక పాటల్లో, అందాల ఆరబోత సన్నివేశాల్లో చూడను ఇష్టపడితే నేను అలా కనపడడం తప్పు కాదు. నాకు ఐదు భాషల్లో బోలెడు అవకాశాలు వస్తున్నా జాగ్రత్తగానే పాత్రలు ఎంపిక చేసుకొంటున్నాను. హిందీలో అయితే ప్రస్తుతం రెండు చిత్రాల్లో నటిస్తున్నట్లు జెనీలియా చెప్పింది.

అవకాశమిస్తే నటిస్తా!



తెలుగులో ఒకే ఒక్క చిత్రం సూపర్‌లో హీరోయిన్‌గా నటించిన ఆయేషాటకియా కొన్ని హిందీ చిత్రాల్లో మెరిసి పెళ్లి చేసుకొంది. చాలా రోజుల గ్యాప్ తర్వాత ఆమె 'మోద్' చిత్రం ద్వారా బాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల నిమిత్తం ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమె మాట్లాడుతూ సూపర్ తర్వాత నాకు తెలుగులో చాలా అవకాశాలు వచ్చాయి. కానీ కొన్ని సినిమాలు నేనే వదులుకొన్నాను. కాల్షీట్లు సర్దుబాటు చేయలేక, ప్రతిసారీ హైదరాబాద్ రాలేక. ఇప్పుడు ఖాళీగా వున్నాను కాబట్టి అవకాశం ఇస్తే తెలుగు చిత్రాల్లో నటిస్తానంటుంది. ఇప్పుడు ఆయేషాకు అవకాశం ఎవరిస్తారు?

జనంలోకి శ్రీధర్‌రెడ్డి

● రూరల్ నియోజకవర్గంలో వంద రోజుల పాదయాత్ర

నెల్లూరు నగరంతోపాటు రూరల్ నియోజకవర్గంలో ఆనం సోదరుల అరాచకాలు, అక్రమాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయని వీటిని ప్రజలకు తెలియజెప్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పార్టీ బలోపేతానికి రూరల్ నియోజకవర్గంలో చేపడుతున్న పాదయాత్ర విశేషాలను వివరించేందుకు ఆయన రాజీవ్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూరల్‌లో పార్టీని బలోపేతం చేయాలని సూచించినందున మెగా పాదయాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. నవంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర నియోజకవర్గంలోని ప్రతి గడప గడపను పలకరిస్తూ వంద రోజులపాటు సాగుతుందన్నారు. రాజన్న రాజ్యం జగన్‌తోనే సాధ్యమవుతుందన్న శ్రీధర్‌రెడ్డి పదవులపై తనకు వ్యామోహం లేదని, జగన్ అనుచరుడిగా ఉండటమే చాలని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పార్టీలో ఎలాంటి విబేధాలు



వివరాలు వెల్లడిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

లేవని, మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఏక నాయకత్వంలో అందరం కలసి మెలసి పనిచేస్తున్నామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జిల్లాలో ఆనం సోదరుల అరాచకాలకు అడ్డు ఆపు లేకుండా పోతోందని, వారి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేకపాటి రాజశేఖర్‌రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తదితర పెద్దల ఆశీస్సులతో సలహాలు, సూచనలతో మెగా పాదయాత్రను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో బట్టేపాటి నరేంద్రరెడ్డి, పిగిలం నరేష్‌కుమార్ యాదవ్, రజని తదితరులు పాల్గొన్నారు.

ఆట బొమ్మలతో అనారోగ్యం

చిన్నారులు ఎంతో ఇష్టంగా కొనుగోలుచేసే ఆటబొమ్మలు అనర్థాలకు హేతువులవుతుండడం పలువురిని ఆశ్చర్యపరుస్తోంది. నిజంగా అది నమ్మలేని నిజం. కంటికింపుగా రకరకాల రంగుల్లో కన్పించే బొమ్మలను చూస్తే చిన్న పిల్లలు ఎంతో ముచ్చటపడతారు. వాటిని కొనిచ్చేదాకా మారాం చేస్తారు. చిన్నారులకు నేస్తాలుగా చెప్పబడే ఇలాంటి ఆట బొమ్మలే వారి ఆరోగ్యాన్ని దెబ్బతీసే విధంగా వుండడం పలువురిని ఆందోళనకు గురి చేస్తోంది. ఆటబొమ్మల్లో వినియోగించే రసాయనాలు బాలలను, వారి ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే విధంగా వున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. పిల్లల ఇష్టాఇష్టాలను దృష్టిలో పెట్టుకొని పలురకాల బొమ్మలను వివిధ రూపాలలో తయారుచేసి అందిస్తున్నాయి వివిధ కంపెనీలు. అయితే వీటి తయారీలో నాణ్యత పాటించకపోవడం, వినియోగించే రంగుల్లో పర్యావరణం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోకపోవడంతో వాటి ప్రభావం పిల్లల ఆరోగ్యంపై అధికంగా వుంటున్నదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ ప్రకటిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే బొమ్మల్లో అధిక భాగం పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారయ్యేవే అధికంగా వుంటున్నాయి. అలంకరణకు వాడే రంగుల్లో లెడ్, జింక్, పాదరసం తదితర వాటిని వినియోగిస్తుండడంతో అలాంటి బొమ్మలను వాడడం వల్ల పిల్లలు ప్రాణాంతకమైన క్యాన్సర్ బారిన పడడమేకాకుండా మెదడు, నాడీ మండలం దెబ్బతినడానికి కారకాలవుతున్నాయని శాస్త్రవేత్తలు, వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్‌తో తయారయ్యే బొమ్మలు, అధికమైన రంగులను వాడిన బొమ్మల్లో విషపూరిత రసాయనాల వల్ల పిల్లలు తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం వుంది.



ఆటబొమ్మలతో జర జాగ్రత్త.

నిరుపయోగంగా మంచి నీటి పథకాలు

పాఠశాలల్లో పరిస్థితిది

అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా వుంది జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పరిస్థితి. కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీటి కోసం నిర్మించిన ట్యాంకులు నిరుపయోగంగా మారడంతో పాఠశాలల్లో నీటి కొరత ఏర్పడింది. దీంతో జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు త్రాగునీటి కోసం కష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు సంకల్పించిన ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. తాగునీటి పథకాల కోసం జిల్లావ్యాప్తంగా 1775 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో రెండేళ్ల క్రితం ఆర్‌డబ్ల్యుఎస్ క్రింద 5.41 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలకు 20వేల రూపాయల నుంచి 30 వేల రూపాయల దాకా కేటాయించడంతో ఆయా పాఠశాలల్లో తాగునీటి పథకాల పనులను ప్రారంభించారు. ఈ నిర్మాణాలు పూర్తయినప్పటికీ పలు పాఠశాలలకు కరెంటు సౌకర్యం లేకపోవడంతో మంచి నీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. కొళాయిల్లో చుక్క నీరు రావడం లేదు. వినియోగించకపోవడంతో ట్యాంకులు అలంకారప్రాయంగా మారగా, పైపులు, కొళాయిలు పగిలిపోయాయి. మరోవైపు విద్యుత్ సౌకర్యం వున్న పాఠశాలల్లో మోటార్లు మరమ్మత్తులకు గురి కావడం, వాటి మరమ్మత్తుల గురించి పట్టించుకోకపోవడంతో విద్యుత్ సౌకర్యం వున్నా విద్యార్థులకు మంచినీటి కష్టాలు తప్పడం లేదు. దాదాపు 50 శాతం పాఠశాలల్లో మంచినీటి ట్యాంకులు నిరుపయోగంగా మారడంతో విద్యార్థులకు మంచినీటి వెతలు తీరడం లేదు. ఆత్మకూరు ప్రాంతంలో పరిశీలిస్తే తాగునీటి పథకాలు నిరుపయోగంగా మారడం కన్పిస్తుంది. చివరకు మరుగుదొడ్లు సైతం ఉపయోగపడని పరిస్థితి ఏర్పడింది.

నత్తనడకన బ్రిడ్జి నిర్మాణ పనులు



ముత్తుకూరు రోడ్డులో మరీ లేటుగా బ్రిడ్జి పనులు.

నెల్లూరు నగరంలో సర్వేపల్లి కాలువపై నిర్మిస్తున్న మూడు బ్రిడ్జిల నిర్మాణ పనులు ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. నగరంలోని ముత్తుకూరు గేటు వద్ద, ఆత్మకూరు బస్టాండు, శెట్టిగుంట రోడ్డు వద్ద బ్రిడ్జిల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించడంతో ప్రధానంగా ఆత్మకూరు బస్టాండు నుంచి స్టోన్‌హౌస్‌పేటకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొంత మేర పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు ఆ తర్వాత కాలయాపన చేస్తుండడంతో మరికొన్ని నెలలపాటు నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు కృషి చేయడం లేదన్న విమర్శలు వున్నాయి. ప్రధానంగా స్టోన్‌హౌస్‌పేట వ్యాపారాలకు కేంద్ర బిందువు. ఈ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు దారి మళ్లించడంతో ఇక్కట్లు ఎదురౌతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సి వుంది.

గ్యాస్ కనెక్షన్ల కోసం నిరీక్షణ

మాటతప్పిన నేతలు

నగరంలోని స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళలకు అందజేసే దీపం పథకానికి రాజకీయ గ్రహణం పట్టింది. అర్హులైన లబ్దిదారులను ఎంపికచేసి వారికి గ్యాస్ కనెక్షన్లు అందజేయాల్సి వుండగా ప్రజాప్రతినిధుల ఒత్తిడి కారణంగా ఈ పథకం ప్రక్కదారి పట్టింది. ప్రజాప్రతినిధుల అండదండలతో వారి అనుచరులు ఇష్టానుసారంగా గ్యాస్ కనెక్షన్లు తమ వారికి ఇప్పించుకోవడంతో దీపం పథకానికి తూట్లు పడ్డాయి. దీంతో అర్హులై వుండి, ఏళ్లతరబడి పొదుపు గ్రూపులను ఏర్పాటు చేసుకొన్న పేద మహిళలకు ఇంతవరకు దీపం కనెక్షన్లు అందలేదు. దీపం పథకం క్రింద ఈ ఏడాది మొదటి విడతగా నగరానికి 1763 గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటివరకు 580 గ్యాస్ కనెక్షన్లు మాత్రమే పంపిణీ చేసినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. అధిక భాగం నేతల అనుచరులు చెప్పిన అనర్హులకే కేటాయించి వుండడం పథకం దారితప్పిన తీరును తెలియజేస్తోంది. ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న తమకు అందలేదని పలువురు లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం అమలులో అక్రమాలు, అవకతవకలు జరగడంపై సిపిఎం పార్టీ పలుమార్లు పలు సందర్భాల్లో ఆందోళన చేపట్టింది. అయితే కార్పొరేషన్ అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా మునిసిపాలిటీని తన కబంధ హస్తాలలో బంధించి వున్న ప్రజాప్రతినిధి చెప్పినట్లు నడుచుకొంటుండడంతో అర్హులకు న్యాయం జరగని పరిస్థితి ఎదురౌతుంది. మరోవైపు రెండో విడతకు వెయ్యి కనెక్షన్లు మంజూరయ్యాయి. ఈ పరిస్థితుల్లో మొదటి విడతలో మిగిలిన 1263 కనెక్షన్లు, కొత్త వాటిని ఎప్పుడు పంపిణీ చేస్తారు, అర్హులకు ఇస్తారో లేదోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



మనుబోలు వాస్తవ్యుడు, ఈదగాలి విఆర్వో వెనుబల్లి ఉపేంద్ర కుమార్తె గురుశ్రావణి, చిరంజీవిల వివాహం 13వ తేది గూడూరు పివిఆర్ కళ్యాణమండపంలో జరిగింది.

అభ్యర్థుల ప్రకటన

16వ పేజీ కొరవ

తులు, అసంతృప్తులు మొదలైపోయాయి. రూరల్ నియోజకవర్గాన్ని తనకు అప్పచెప్పారని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పదిమందికి చెప్పడంతో, అదే నియోజక వర్గం నుంచి టిక్కెట్ ఆశిస్తున్న ఆనం వెంకటరమణా రెడ్డి ఆగం మొదలు పెట్టాడు. ఆయనకు మేకపాటి సోదరుల అండ లభించింది. వారు జగన్‌ను ఇదేమి టని ప్రశ్నించారట. మేకపాటి సోదరులతో తనకున్న మొగమాటం కాదనుకోలేక జగన్, నేను శ్రీధర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని సూచించలేదని, కష్టపడి పని చేసు కోమని మాత్రమే చెప్పానని వివరణ ఇచ్చాడట. దీనితో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. శ్రీధర్‌రెడ్డి ఆ నియోజకవర్గంలో తన స్థానాన్ని పదిల పరచుకోవ డానికి 100 రోజుల పాదయాత్ర తలపెడుతు న్నాడు.

జిల్లాలో అందరికంటే ముందుగా జగన్ పక్షం చేరిన కాంగ్రెస్‌వాది కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి. కానీ ఆయన దగ్గర డబ్బు లేదు. ఇదే స్థానం నుంచి టిక్కెట్ ఆశిస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అపర కుబేరుడని ప్రసిద్ధి. దానితో సహజంగానే జగన్ మొగ్గ అటు తూగింది. నేరుగా విష్ణువర్ధన్ రెడ్డిని పిలిచి, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి సమక్షంలోనే, నీకు టిక్కెట్ ఇవ్వను, అందుకు బదలుగా అధికా రంలోకి వచ్చిన తర్వాత శాసనమండలి స్థానం ఇస్తానని చెప్పాడట జగన్. రామిరెడ్డితో పోలిస్తే విష్ణు చాలా సీనియర్ నేత. 1989 నుంచి రాజకీ యాలలో వున్నాడు. ముందొచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు జగన్ ప్రవ ర్తించడంతో విష్ణు అలుక పాన్పు ఎక్కాడు.

ఆత్మకూరులో కొమ్మి లక్ష్మయ్య నాయుడును ఎంపిక చేశాడు జగన్. కొమ్మి ఇంకా పార్టీలో చేరలేదు. కానీ వారం క్రితం జగన్‌ను కలిసి వెళ్లా డట. కొమ్మికి అనుచరులెంత మందో, శత్రువులూ అంతే మంది. వారంతా ఇప్పుడు జగన్ మీద ఒత్తిడి తెస్తున్నారు. తనది రెడ్ల పార్టీ అనే ముద్ర చెడుపు కోవడానికి అక్కడక్కడా ఒకరిద్దరు కమ్మ వారికి టిక్కెట్లు ఇవ్వాలన్నది జగన్ ఆలోచన. అందుకే కొమ్మిని దగ్గర తీయజూస్తున్నాడు. ఆత్మకూరులో తమ సమ్మతి కోరకుండా అభ్యర్థి నిర్ణయం చేయడం మేకపాటి సోదరులకు కూడా మనసు కష్టం కల్గిం చిందని వినికిడి.

కోవూరులో ప్రసన్నకుమార్ రెడ్డి పార్టీలో వుంటాడా వుండడా అన్నది పెద్ద ప్రశ్న. కానీ ఎమ్మె ల్యేగా వుంటూ తన దగ్గరకు వచ్చిన వాడు కాబట్టి, ఆయనకు కాదనే పరిస్థితిలో జగన్ లేడు.

గూడూరు డివిజన్‌లోని మూడు స్థానాలకూ అభ్యర్థులను నిర్ణయించలేక పోయాడు జగన్. గూడూరులో కేంద్ర మంత్రిణి పనబాక లక్ష్మి పతి దేముడు పనబాక కృష్ణయ్య లోపాయికారీగా జగ న్‌తో సంబంధాలు పెట్టుకొని వున్నాడన్నది బహి రంగ రహస్యం. ఎన్నికల నాటికి నేను వచ్చేస్తానని నమ్మబలుకుతున్నాడట. దానితో దాన్ని పెండింగ్‌లో పెట్టినట్లున్నారు. సూళ్లూరుపేటలో నెలవల సుబ్ర హ్మణ్యం ఒక్కడే వారికున్న నాయకుడు. కానీ స్థాని కంగా వున్న కొందరు రెడ్లకు ఆయనంటే పడదు. దానితో వారు జగన్ చెవిలో ఇల్లు కట్టుకొని పోరు తున్నారు, నెలవల వద్దు అని. వెంకటగిరిలో ఇప్పటి వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెప్పుకోదగిన స్థాయి కల్గిన నేత ఎవరూ లేరు.

సర్వేపల్లి, ఉదయగిరి, నెల్లూరు నగరం స్థానాలు పేచీ లేనివి. అందువల్ల వాటిలో చింతా కంత చికాకు ఏర్పడలేదు.

మొత్తానికి ఎన్నికలకు రెండున్నర ఏళ్ల ముం దుగా అభ్యర్థులను నిర్ణయించి ఒక కొత్త ప్రయో గానికి శ్రీకారం చుట్టాడు జగన్. కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలు అభ్యర్థి అంటూ ఎవరికీ పేరు పెట్ట నప్పటికీ ఆయా నియోజకవర్గాలలో పాతుకు పోయిన నేతలున్నారు కాబట్టి, వారిని ఢీకొనాలంటే ఇప్పటి నుంచే ప్రయత్నం అవసరమన్నది జగన్ ఉద్దేశం. ఆయన వ్యూహం ఎంత వరకు ఫలిస్తుందో వేచి చూద్దాం.

జనవాణి

2వ పేజీ కొరవ

దుస్థితిలో ముస్లింలు!

దేశంలో నివసిస్తున్న ముస్లింల జనాభాలో 80 శాతం మంది దుర్భర దారిద్రంలో కొట్టు మిట్టాడుతున్నారని వివిధ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. వీరు ప్రభుత్వ ఉద్యోగాల్లో దళితులు, గిరిజనుల కన్నా తక్కువ సంఖ్యలో వున్నారు. దేశం లోని 12 రాష్ట్రాల్లో అత్యధిక ముస్లిం జనాభా వున్న ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో వీరు ఆరు శాతంలోపే వున్నారని సచార్ కమిటీ స్పష్టం చేసింది. మతాలవారీగా చూస్తే జైనుల్లో 100, క్రైస్తవుల్లో 90, హిందువుల్లో 75, బౌద్ధులలో 73 శాతం మంది అక్షరాస్యులు ఉండగా ముస్లింలలో 50 శాతం మంది కూడా అక్షరాస్యులుగా లేరు. ముస్లింల అభివృద్ధికి అధికారంలో వున్న ఏ రాజ కీయ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేయకపోవడం బాధా కరం.

షేక్ అబిద్‌హుస్సేన్ నెల్లూరు

కావలిలో చందాల వసూళ్లు!

కావలిలో ఇటీవల విరాళాల దందా ఎక్కు వయ్యింది. ఇటీవల ఓ గ్రామదేవత దేవస్థానం అభి వృద్ధికంటూ పెద్ద మొత్తాల్లో చందాలు వసూలు చేశారు. విరాళాలిచ్చిన వారికి ప్రసాదం, పసుపు, కుంకుమలు కూడా ఇవ్వలేదు. అదేవిధంగా వివిధ సంస్థల పేరుతో కొందరు వ్యక్తులు విరాళాలు ప్రోగు చేస్తున్నారు. కావలిలో వ్యాపారవర్గాలు ఎక్కువ వుం డడం వల్ల లేనిపోని సమస్యలకు భయపడి విరా ళాలివ్వక తప్పడం లేదు. మాటిమాటికీ కావలిలో చందాలు వసూళ్లు చేసే వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాల్సి వుంది.

బాధితుడు కావలి

చల్లారిన తెలంగాణ ఉద్యమం

మొదటి పేజీ కొరవ

పెద్దలు కెసిఆర్‌కు సమ్మె ఉధృతి తగ్గించమని సలహా ఇచ్చారనే ప్రచారం. తెలంగాణ విషయంలో నవం బర్ 15తేది లోగా తామొక స్పష్టమైన సానుకూల ప్రకటన చేయనున్నామని, అందువల్ల ఉద్యమం అదుపు తప్పిపోక ముందే ఉధృతి తగ్గించమని కోరా రని చెప్తున్నారు. వారి మాట విశ్వసించినందువల్లనే ఆయన పాల పొంగు మీద నీళ్లు చల్లాడని చెప్తున్నారు.

కారణం ఏదైనా తెలంగాణ ఆందోళన తాత్కా లికంగా ఉపశమించింది. ప్రజా జీవితం కొంతలో కొంత కుదుట పడింది. ఒక్క ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే సమ్మె కొనసాగిస్తున్నారు. వారి మీద కూడా విరమణ ఒత్తిడి దట్టంగా వుంది.

ఢిల్లీలో మాత్రం తెలంగాణ విషయంలో ఒక నిర్దిష్టమైన నిర్ణయం కన్పించడం లేదు. కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి మాత్రం తెలంగాణ తప్పక వస్తుందని ఘంటాపథంగా చెప్తున్నాడు. ఆయనకు ఉన్నత వర్గా లలో వున్న సంబంధాల దృష్ట్యా ఆయన మాటను తేలికగా తీసి వేయలేము. అయితే ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మాత్రం ఏకాభిప్రాయ సాధనకు కష్టపడి చర్చలు కొనసాగిస్తున్నామని పదే పదే చెప్తు న్నాడు. ఏకాభిప్రాయం అనేది అసంభవమైన విష యం. రాజకీయ పార్టీలలో, రాష్ట్రంలోని ఉభయ ప్రాంతాలలో దీనిపై వున్న బేధాభిప్రాయాల దృష్ట్యా ఏకాభిప్రాయం వీలు కాని పని. అందువల్ల జైపాల్ రెడ్డి ఆశకు ఆధారం ఏమిటో అర్థం కావడం లేదు.

అయితే నవంబర్ మూడవ వారంలో ప్రారం భం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల లోపల తెలంగాణకు సంబంధించి ఒక ప్రకటన వెలువడవచ్చునని మాత్రం అందరూ చెప్తున్నారు. అది సానుకూలంగా వుంటుందని కూడా వూహిస్తు న్నారు. అటువంటి ఉపశమన చర్య చేపట్టకపోతే తెలంగాణ ఎమ్పీలు పార్లమెంట్‌ను స్తంభింప చేసే ప్రమాదం వుంది. బిజెపి వారికి పూర్తి మద్దతు ప్రక టిస్తున్నది కాబట్టి ఇబ్బందికర పరిస్థితులు ఎదురౌ తాయి. తెలంగాణ ఇవ్వాలనే తాము భావిస్తున్నా మని, అయితే హైదరాబాదు వ్యవహారం, ఆంధ్ర ప్రాంతం అభ్యంతరాలను సామరస్యంగా పరిష్కరిం చిన తర్వాత కొత్త రాష్ట్రం ఏర్పాటు చేస్తామని, అంతవరకు తెలంగాణకు భారీ ఎత్తున ఆర్థిక సహా యం అందిస్తామని కేంద్రం ప్రకటన చేయవచ్చు నని అంచనా.

కాంగ్రెస్ పరిస్థితి దయనీయం

ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా నష్టపోతున్న ప్రధాన పార్టీ కాంగ్రెస్ మాత్రమే. తెలంగాణ ప్రాంతంలో దాని పరిస్థితి చాలా దయ నీయంగా వుంది. తెలంగాణ ప్రజలు ఆ పార్టీ నేత లను ద్రోహులుగా చూస్తున్నారు. అవకాశం దొరి కితే పట్టుకొని తన్నాలన్నంత ఆగ్రహంతో వున్నారు. జానారెడ్డి వంటి సీనియర్లే జనంలోకి రాలేక పోతు న్నారు. మంత్రులను జనం చాలా అసహ్యంగా చూస్తున్నారు. ఈ పరిస్థితులలో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ఆందోళన ప్రతి కాంగ్రెస్‌వాది లోనూ గుబులు రేపుతున్నది. కాంగ్రెస్‌ను వదలిపోక తప్పదన్న భావన బలపడుతున్నది.

నివురుగప్పిన నిప్పు

సకల జనుల సమ్మె చల్లారి పోయినా జనంలో తెలంగాణ అకాంక్ష మాత్రం ఉపశమించే సూచ నలు కన్పించడం లేదు. వారి మనసులలో అది బలీయంగా స్థిరపడిపోయింది. సమ్మె విరమించి బడులకు వచ్చిన అయ్యవార్ల మీద కొన్ని గ్రామా లలో జనం తిరగబడి శాపనార్థాలు పెడుతున్నారు. రాష్ట్రం ఏర్పాటు జరగకుండానే మీరు బడికి ఎం దుకు వచ్చారని నిలదీస్తున్నారు. దాన్నిబట్టి, ప్రజ లలో తెలంగాణ కోరిక ఎంత బలంగా వుందో అర్థం చేసుకోవచ్చు. దాన్ని విస్మరించి, రాజకీయ నాయకులను బుజ్జగించడం ద్వారా ఉద్యమాన్ని అణిచి వేయచూడడం ఆత్మహత్యా సదృశ్యం. ప్రజల అభిమతానికి విరుద్ధంగా ప్రజాస్వామ్యంలో ఏ నిర్ణయమూ అమలు కాదు. బలవంతంగా రుద్దితే పరిణామాలు వికృతంగా వుంటాయి.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

స్థానం సహాయ కమిషనర్‌గా ఆదికేశవులు పిళ్లై నియమితులయ్యారు. చిత్తూరు జిల్లాలో మొగిలి గ్రూప్ దేవాలయాలకు కార్యనిర్వహణాధికారిగా పని చేస్తున్న ఆయనకు ప్రమోషన్ ఇచ్చి ఇక్కడ నియ మించారు. దేవస్థానం ఇన్‌ఛార్జ్ సహాయ కమిషన ర్‌గా పనిచేస్తున్న కోవూరు జనార్దన్‌రెడ్డిని మూల స్థానేశ్వరాలయంకు పంపారు. పిళ్లై నియామకం ఆనం సోదరులకు తెలియకుండా జరిగిందని చెబు తున్నారు. దీనివల్లే పాత ఇఓను ఇతనికి ఛార్జి ఇవ్వ వద్దని చెప్పినట్లు విశ్వనీయంగా తెలిసింది.

జాషువా కవితాపీఠం రజతోత్సవ వేడుకలు!

నెల్లూరులోని జాషువా కవితా పీఠం రజ తోత్సవ వేడుకలు 28, 29 తేదీల్లో టౌన్‌హాల్‌లో జరుగుతాయి. ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎస్.చెల్లప్ప, ఐపిఎస్ అధికారి పట్టపు రవి, ఐఆర్‌టిఎస్ అధికారి రావెల కిషోర్‌బాబు, ప్రఖ్యాత రచయిత డాక్టర్ ఎండ్లూరి సుధాకర్, పి.ఆనందకిషోర్ ఈ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సాహిత్య గోష్టి, కవి సమ్మేళనం, సంగీత విభావరి, వివిధ రంగాల్లో లబ్ద ప్రతిష్టలను సన్మానించనున్నట్లు నిర్వాహకుడు విద్వాన్ కిరణశ్రీ చెప్పారు.

అమీర్‌జాన్‌కు అవార్డు

నెల్లూరు చిత్రకారుడు అమీర్‌జాన్ చిత్రించిన 'మహావృక్షం'కు ఆసిస్ట్ వరల్డ్ రికార్డు లభించింది. మహావృక్షం చిత్రంలో అమీర్‌జాన్ ఏకకణ జీవి అమీబా నుంచి నేటి రాకెట్ యుగంలో జరిగిన పరి ణామాలపై 512 చిత్రాలను ఒక చెట్టులా చిత్రీకరిం చాడు. ఈ నెల 15వ తేది పాండిచ్చేరిలో మాజీ రాష్ట్ర పతి డాక్టర్ అబ్దుల్‌కలాం జన్మదినోత్సవాన్ని పురస్క రించుకొని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ చిత్రకళా ప్రదర్శనలో అమీర్‌జాన్ విజేతగా నిలి చారు. 16వ తేది జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో పాండిచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి పాల్గొని అమీర్‌జాన్‌కు బహుమతినందించారు. ఈ కార్యక్రమంలో పాండిచ్చేరి ఎమ్మెల్యే నల్సరాజన్, అసిస్ట్ వరల్డ్ రికార్డు వ్యవస్థాపకులు రాజేంద్రన్ పాల్గొన్నారు.

బంగారు కారు

టాటా గోల్డ్ ప్లస్ రూపొందించిన బంగారు కారు నగరంలో కొలువుదీరి పలువురిని ఆకట్టు కొంది. టాటావారి ఉత్పాదనైన నానో కారును ప్రఖ్యాత డిజైనర్లు బంగారు కారుగా తీర్చిదిద్దారు. అందుకోసం 80 కేజీల బంగారు, 15 కేజీల వెం డిని వినియోగించి 30 మంది నిపుణుల పర్యవేక్ష ణలో దీనిని రూపొందించారట. ఆమని గార్డెన్స్‌లో వుంచిన ఈ బంగారు కారు ఎగ్జిబిషన్‌ను నగర శాసనసభ్యుడు శ్రీధర్‌కృష్ణారెడ్డి ప్రారంభించి నిర్వా హకులను అభినందించారు.

డెల్టాకు నీరు విడుదల

సోమశిల ప్రాజెక్ట్ నుంచి పెన్నా డెల్టాకు 16వ తేది నీటిని విడుదల చేశారు. కనిగిరి రిజర్వా యర్‌కు రోజుకు 1000 క్యూసెక్కులు, ఉత్తర, దక్షిణ కాల్వలకు 100 క్యూసెక్కులు, కండలేరు ప్రాజెక్టుకు 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కనీస వేతనాలకు నోచుకోని ఆశావర్కర్లు!

గ్రామీణులకు వైద్యసేవలు నిరంతరం అందించే ఆశావర్కర్లకు రోజురోజుకు పనిభారం పెరగడం తప్ప వేతనాలు పెరగడం లేదు. నాలుగు వేల రూపాయలు గౌరవ వేతనం అందిస్తానన్న ప్రభుత్వ హామీ ఉత్త హామీగానే మిగిలింది.



తమ సమస్యల పరిష్కారం కోసం గతంలో సమ్మెకు దిగిన ఆశావర్కర్లు.(ఫైల్‌ఫోటో)

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు నియమించిన 'ఆశా'వర్కర్లు కనీస వేతనాలు అందక ఇక్కట్లు పడుతున్నారు. ఎఎన్‌ఎంలతోపాటు ఆశావర్కర్లు ప్రజలకు అవసరమైన వైద్య సలహాలు అందిస్తుంటారు. వీరి నియామకం జరిగిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలకు సంబంధించి ఏ అవసరం ఏర్పడినా అందుబాటులో వుంటూ సకాలంలో ఆస్పత్రులకు తీసుకెళుతున్నారు. తొలుత స్వచ్ఛందంగా వైద్యసేవలు అందించేందుకు ముందుకు వచ్చిన వీరికి గౌరవ వేతనం 200 రూపాయలు అందించేది ప్రభుత్వం.

కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయిస్తే 200రూపాయలు పారితోషికంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే వీరి చేత అన్ని పనులు చేయిస్తుండడంతో గౌరవ వేతనం పెంచాలన్న డిమాండ్ వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు అసోసియేషన్‌గా ఏర్పడి పలుదఫాలు ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం స్పందించి 4000 రూపాయలు చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం హామీ ఇచ్చిందే తప్ప ఆర్థిక వనరుల కొరత కారణంగా నిధులు విడుదల చేయలేకపోయింది. ప్రస్తుతం ఆశావర్కర్లకు నెలకు గౌరవ వేతనంగా 600రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇతర పనులు చేసుకోలేని విధంగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వివిధ రకాల పనులు వీరికి అప్పగిస్తున్నారు.

పని భారం అధికం కావడం, అందుకు తగ్గ వేతనాలు చెల్లించకపోవడంతో వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భవతులు, బాలింతలకు ఆరోగ్యసేవలు అందించడంలో వీరిది కీలకపాత్ర. సకాలంలో ఆస్పత్రులకు తీసుకెళ్లి చేర్పించేందుకు సహాయపడుతుంటారు. అర్ధరాత్రి సమయంలో కూడా రోగులు వచ్చి పిలిచినా వారివెంట ఆస్పత్రులకు వెళుతుంటారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో అధికారులు నిర్ణయించిన లక్ష్యాలు సాధిస్తుంటారు. ప్రభుత్వం మాత్రం ఆశావర్కర్ల పట్ల చాలా చిన్నచూపు కనబరుస్తుంది. ప్రస్తుతం వైద్య, ఆరోగ్యశాఖద్వారా చెల్లించే 600 రూపాయలు సక్రమంగా అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరునెలలకోసారి గౌరవవేతనం అందిస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఆందోళన చేసిన ఫలితంగా గౌరవవేతనాన్ని 4000 రూపాయలుగా పెంచిన ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ రకాల పనులు ఆశావర్కర్ల చేత చేయించుకుంటున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అవసరమైన వేతనాలు మంజూరు చేయించేందుకు కృషి చేయడం లేదు. ఒకప్రక్క పని భారం, మరోప్రక్క కనీస వేతనాలు అందక తాము ఎలా జీవనం సాగించాలని ప్రశ్నిస్తున్నారు. వేతనాలు పెంచడంతోపాటు అదనపు పనిభారాన్ని తగ్గించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా పంపిణీ చేయాల్సిన మందులు వీరికి అందించడం లేదు. వారానికో పది రోజులకో చుట్టపు చూపుగా గ్రామాలకు వెళుతున్న ఎఎన్‌ఎంలు మందులు అందించాల్సి వున్నప్పటికి అందించలేకపోతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఎఎన్‌ఎంలపై సరైన పర్యవేక్షణ చేయకపోవడం ఇందుకు కారణం. ఇప్పటికైనా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ స్పందించి ఆశావర్కర్లకు గతంలో పెంచిన గౌరవ వేతనాన్ని విడుదల చేయడంతోపాటు ప్రతి నెలా వేతనం చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాటర్ షెడ్లను బలహీనపరుస్తున్న అవినీతి ఊట!

బీడు భూముల అభివృద్ధికి ఉద్దేశించిన వాటర్ షెడ్ల నిర్మాణాల్లో అవినీతికి రాజకీయజోక్యం తోడవ్వడంతో ఈ పథకం ప్రక్కదారి పడుతోంది. చేసిన పనులనే మళ్లీ చేసినట్లు బిల్లులు సృష్టించి దోచుక తింటున్నా పట్టించుకొనేవారు లేకుండా పోయారు.

జిల్లాలో బీడు భూముల అభివృద్ధి పథకం క్రింద చేపడుతున్న వాటర్ షెడ్ల నిర్మాణాల్లో అవినీతి ఊట ప్రవహిస్తోంది. ఈ నిర్మాణాలు పరమ నాసిరకంగా జరుగుతుండడంతో లక్షల రూపాయలు వృధాఅయిపోతున్నాయి. అడిగే నాధుడే లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం ప్రక్కదారి పడుతోంది. భూగర్భజలాల పెంపు కోసం వాటర్ షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2002 నుంచి ఆరు దశల్లో సాగుతున్న ఈ పథకానికి అవినీతి, రాజకీయ జోక్యం తోడవడంతో పథకం ప్రక్కదారిపడుతోంది. చేసిన పనులకే బిల్లులు సృష్టించి దోచుకతింటున్నా ఏ అధికారి పట్టించుకోకపోవడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు.

జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఈ పథకం నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ఈ పథకం క్రింద నీటిని నిల్వ చేసే చెక్‌డ్యాంలు, నీటి కుంటలు, భూమికోతలు నివారించే కట్టడాలు, సప్లయ్‌చానళ్ల మరమ్మత్తులు చేపడుతారు. ఈ పనుల ద్వారా 500హెక్టార్లకు సాగునీరు అందించడంతోపాటు భూ అభివృద్ధికి చర్యలు చేపడుతారు. గ్రామస్థాయిలో వాటర్‌షెడ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకొంటారు. ప్రతి వాటర్‌షెడ్ నిర్మాణానికి 30లక్షలు విడుదల చేస్తారు. ఇదే కాకుండా 6.5లక్షలను గ్రామంలోని మహిళా సంఘ సభ్యులు వినియోగించుకొని అభివృద్ధి చెందాల్సి వుంటుంది. అలాగే రైతులకు లక్ష రూపాయలతో వివిధ రకాల వ్యవసాయ పరికరాలతోపాటు జీవనోపాధికోసం ఉత్పత్తి వస్తువులను అందిస్తారు. వచ్చే ఏడాది మార్చి చివరిలోగా ఈ పనులు ముగించాల్సి వుండగా రాజకీయ కారణాలు, అవినీతి అక్రమాలతో పథకం అస్తవ్యస్తంగా మారింది. కమిటీలను ప్రక్కనపెట్టి రాజకీయ అండదండలున్న కాంట్రాక్టర్లు పనులు చేపట్టడంతో పలు ప్రాంతాలలో రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన మెట్ట ప్రాంత మండలాల్లో వాటర్‌షెడ్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. 76వేల హెక్టార్లలో వాటర్‌షెడ్ల నిర్మాణానికి 2.16కోట్లు ఖర్చు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు షుమారు 14కోట్ల రూపాయలు ఖర్చు చేసి 21.925హెక్టార్లలో భూమి అభివృద్ధి చేపట్టినట్లు అధికారులు ప్రకటిస్తున్నా పలు చోట్ల నిర్మాణాలు నాసిరకంగా వున్నాయి. చిట్టమూరు మండలంలో నిర్మించిన వాటర్‌షెడ్లు, చెక్‌డ్యాంలు నాసిరకంగా వుండి పగుళ్లు ఏర్పడ్డాయి. మర్రిపాడు మండలం పడమటినాయుడు పల్లిలో నిర్మించిన సప్లయ్‌చానళ్లు, చెక్‌డ్యాంలు రైతులకు ఉపయోగపడకపోవడంతో లక్షల రూపాయలు వృధా అయ్యాయి. ఆత్మకూరు మండలం నెల్లూరుపాళెం వద్ద నిర్మించిన చెక్‌డ్యాంలు పశువులు త్రాగునీరుకు ఉపయోగపడుతున్నాయి. ఉదయగిరి, దుత్తలూరు, చేజర్ల మండలాల్లోను ఇదే పరిస్థితి. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, రాజకీయ జోక్యం కారణంగా సదుద్దేశంతో రైతుల కోసం చేపట్టిన పథకం ప్రయోజనం లేకుండా పోతోంది.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

జగన్ సరికొత్త ప్రయోగం

ఎన్నికలకు రెండున్నర ఏళ్ల ముందుగా అభ్యర్థుల ప్రకటన!

ఆలూ లేదు, చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లు, ఎన్నికలు ఎప్పుడు వస్తాయో ఎవరూ వూహ కూడా చేయలేని దశలో శాసనసభ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటిస్తున్నాడు వైఎస్.జగన్. నెల్లూరు జిల్లాలో ముప్పాతిక భాగం నియోజకవర్గాలకు అభ్యర్థుల నిర్ణయం చేసేశాడాయన. ఇప్పటి నుంచే ఓట్ల వేటలో నిమగ్నం కమ్మని ఆయా అభ్యర్థులకు గీతోపదేశం చేశాడు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ భవిష్యత్తు ఏమిటో ఎవరికీ తెలియదు. ఓదార్పు యాత్రల తీరు చూస్తే మాత్రం జగన్ పట్ల జనానికి మోజు తగ్గలేదని అభిప్రాయం కల్గుతున్నది. కానీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల వ్యవధి వుంది. అప్పటికి రాజకీయం ఎన్ని మార్పులకు లోనౌతుందో అంచనా కట్టడం ఆ బ్రహ్మకు కూడా సాధ్యం కాదు. జగన్ మీద సిబిఐ విచారణ ఏ మలుపు తిరుగుతుందో వూహించ లేము. ఆయన జైలుకు వెళ్తాడా, వెళ్తే ఎప్పటికి బయటకు వస్తాడు, ఎన్నికల వరకు శ్రీకృష్ణ జన్మస్థానమే నివాసంగా వుంటే పరిస్థితి ఏమిటి? ఆ స్థితిలో అసలు పార్టీ వుంటుందా? చెల్లా చెదరై పోతుందా? సుదీర్ఘ కాలం జైలులో కాలం గడిపిన తర్వాత కూడా జనం జగన్‌ను ఇదే తీరులో ఆరాధిస్తారా, లేక అవినీతిపరులందరి వలె తిరస్కరిస్తారా? అసలు జగన్‌కు ఎన్నికలలో పోటీ చేసే అర్హత చట్ట ప్రకారం మిగులుతుందా? ఇవన్నీ సమాధానం చెప్పలేని ప్రశ్నలు. వూహాజనితమైన అంచనాలు. జగన్ స్థానంలో మరొకరు వుండి వుంటే, సిబిఐ కేసుల ముట్టడికి బిక్క చచ్చిపోయి వుండేవారు. రాజకీయం సంగతి దేముడెరుగు, జైలు జీవితం తప్పితే చాలునని వెయ్యి దేముళ్లకు మొక్కుతూ కాలం గడిపేవారు. కానీ జగన్ అందుకు భిన్నంగా, కేసులు గీసుల వూసు వదలిపెట్టి, అవి తనకు సంబంధించినవి కావనే తీరులో దృష్టంతా రాజకీయం మీదనే గురి పెడుతున్నాడు. ఎప్పుడో రానున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నాడు.

నెల్లూరు జిల్లాకు సంబంధించి ఏడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశాడు జగన్. నెల్లూరు నగరంకు అనిల్ కుమార్ యాదవ్, నెల్లూరు రూరల్‌కు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరుకు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, కావలికి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఉదయగిరికి మేకపాటి చంద్ర శేఖర్‌రెడ్డి, ఆత్మకూరుకు కొమ్మి లక్ష్మయ్య నాయుడు, సర్వేపల్లికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తమ అభ్యర్థులనే సూచన ఇచ్చాడు.

ప్రజారాజ్యం పార్టీ స్థాపనలో చిరంజీవికి ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకొన్నాడని వినికిడి. అప్పట్లో చిరంజీవి, తన దగ్గరకు వచ్చిన వారందరికీ మీరే అభ్యర్థులనే భ్రమ కల్పించాడు. ఒక్కొక్క నియోజకవర్గంలో ఆరేడు మంది ఆశావహులు సిద్ధమైనారు. ఆ ఆశతో ఎన్నికలకు ముందు తమ ఇళ్లు వళ్లు గుల్ల చేసుకొని పార్టీ కార్యక్రమాలు జరిపించారు. ఒకరితో ఒకరు పోటీలు పడి మరీ కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. తీరా ఎన్నికలు వచ్చేసరికి, టిక్కెట్ రాని వారంతా ఆశాభంగంతో పార్టీకి తీరని అపకారం చేశారు. దానివల్ల చాలా నష్టం జరిగింది. తనకు అటువంటి చేదు అనుభవం ఎదురు కాకూడదన్నది జగన్ అభిమతం. అందుకే ఇంత ముందుగా అభ్యర్థులను నిర్ణయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టాడు.



అయితే దానివల్ల ఆదిలోనే హంసపాదు పడింది. నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాలకు సంబంధించి తిరుగుబాట్లు, అసమ్మ

కొరవ 14వ పేజీలో



Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com